RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :59 బుధవారం 27 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## టీమ్ 2029

### సౌత్ టార్గెట్ గా కేబినెట్ విస్తరణ



**న్యూఢిల్లీ, మే 26:** ఢిల్లీ రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా కేంద్ర మంత్రివర్గ విస్తరణ గురించిన చర్చలే నడుస్తున్నాయి. మోదీ 3.0 ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండేళ్లు కావస్తున్న తరుణంలో, పాలనలో సరికొత్త జోష్ నింపేందుకు ప్రధాని భారీ మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సారి జరగబోయే విస్తరణలో కేవలం ఎంపీలు మాత్రమే కాదు, ఏకంగా ఇద్దరు ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులకు కూడా చోటు దక్కబోతోందనేది ప్రధానంగా వినిపిస్తున్న గాసిప్. ఈ సారి మంత్రివర్గంలోకి మాజీ ముఖ్యమంత్రులను తీసుకు రావడం ద్వారా అనుభవం అనే కార్డును - మిగతా5లో

రిపోర్టర్లు కావలెను

ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను

సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.

ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు
వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## మహిళా సంఘాలకు
# కార్పొరేట్ స్థాయి బలం

### కోటీశ్వరుల దిశగా సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు..

**హైదరాబాద్:** రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు భారీ స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల కోసం నిర్మించనున్న 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. మహిళా సంఘాలు వ్యాపార రంగంలో మరింతగా రాణించేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సంస్థల స్థాయిలో, ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం - మిగతా5లో



## హైదరాబాద్‌పై కేటీఆర్
# వ్యూహాత్మక గాలం

**హైదరాబాద్, మే 26 :** తెలంగాణలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత గులాబీ పార్టీ తన తదుపరి ప్రధాన లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై గురిపెట్టింది. కూకట్‌పల్లిలో జరిగిన పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, ప్రకటించిన హామీలు పూర్తిగా గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా సాగాయి. గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు తమకు అందించిన తిరుగులేని మద్దతును కాపాడుకుంటూనే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా నగరంలో పట్టు బిగించాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ నగర అభివృద్ధిలో మౌలిక వసతుల కల్పన అత్యంత కీలకం. గత బీఆర్ఎస్ పాలనలో నగరానికి 24 గంటల నిరంతర



విద్యుత్ అందించామని గుర్తుచేసిన కేటీఆర్, రాబోయే రోజుల్లో తాము మళ్లీ అధికారంలోకి వస్తే నగరంలోని ప్రతి ఇంటికి 24 గంటల పాటు నిరంతర తాగునీటిని సరఫరా చేస్తామని హామీ -- మిగతా5లో

## కాలానికి అనుగుణంగా
# జర్నలిస్టులు మారాలి..

### వృత్తి నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ అవసరం
### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి..
### యూనియన్‌పై సభ్యులకు నమ్మకం కలిగించాలి
### టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



**హైదరాబాద్, మే 26 అక్షర సవాల్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకోవాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో హనుమకొండ జిల్లా నూతన టీయూడబ్ల్యూజే కమిటీ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్‌లు మీడియా అకాడమీ చైర్మన్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కమిటీ ప్రతిపాదన మేరకు జిల్లాలో - మిగతా2లో

## స్కూళ్లు, ఆలయాల సమీపంలో మద్యం దుకాణలపై నిషేధం..



సువేందు అధికారి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి (Suvendu Adhikari) మంగళవారంనాడు పలు సంక్షేమ, నియంత్రణ చర్యలను ప్రకటించారు. విద్యాసంస్థలు, ఆలయాలకు ఒక కిలోమీటర్ దూరంలోపు మద్యం దుకాణాలపై నిషేధం విధించారు. మహిళలకు ప్రతినెలా ఆర్థిక సాయం, రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీపై చేపలతో కూడిన భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సువేందు అధికారి వివరిస్తూ, స్కూళ్లు, కాలేజీలు, ఆలయాలకు కిలోమీటరు దూరంలోపు మద్యం దుకాణాలను అనుమతించమని చెప్పారు. అన్నపూర్ణ యోజన కింద అర్హులైన మహిళలకు రూ.3,000 ఆర్థికసాయం అందించనున్నామని, మే 27 నుంచి అప్లికేషన్లను సెక్రటేరియట్ నుంచి జారీ చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

**రూ.5కే చేపల కూరతో భోజనం**

రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీతో క్యాంటిన్లు ఏర్పాటు చేయనున్నామని, రూ.5కే చేపలతో కూడిన భోజనం అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ఇందుకోసం 400 క్యాంటిన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

## వర్కింగ్ ఉమెన్ భద్రత సంరక్షణ
# ప్రభుత్వ బాధ్యత..

### బంజారాహిల్స్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్, సఖి కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



మహిళా వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ "సఖి నివాస్", వన్ స్టాప్ సెంటర్ "సఖి కేంద్రం"ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, చైల్డ్స్ రైట్స్ కమిషన్ సభ్యులు బండి అపర్ణ, వందన గౌడ్ మరిపల్లి చందన, సరిత, ప్రేమ్ లత అగర్వాల్, ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చే మహిళలకు సురక్షిత వసతి కల్పించేందుకు ప్రభుత్వం వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ హాస్టల్‌లో సుమారు 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పించామని తెలిపారు. చిన్న పిల్లలతో వచ్చే తల్లులు కూడా ఇక్కడే బస చేసే విధంగా ప్రత్యేక సదుపాయాలు - మిగతా5లో

## తెలంగాణలో రేషన్ కార్డుల
# ఏరివేత...




**హైదరాబాద్, మే 26:** తెలంగాణలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి తెల్ల రేషన్ కార్డులు పొందిన ప్రభుత్వ, భారీగా వేతనాలు పొందే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కార్డులను పౌరసరఫరాల శాఖ రద్దు చేస్తోంది. రూ. 6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండి ఐటీ రిటర్న్ దాఖలు చేసేవారిని, పరిమితికి మించి భూమి ఉన్నవారిని అనర్హులుగా గుర్తిస్తున్నారు. అయితే బ్యాంకు రుణాల కోసం తప్పుడు ఆదాయం చూపిన నిజమైన అర్హులకు అన్యాయం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరుపుతున్నారు. తెలంగాణలో నిరుపేదలకు అందాల్సిన తెల్ల రేషన్ కార్డులను దుర్వినియోగం చేస్తున్న అనర్హులపై పౌరసరఫరాల శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో కార్డులు పొంది ఇన్నాళ్లు దర్జాగా రేషన్ బియ్యాన్ని, ఇతర ప్రభుత్వ సదుపాయాలను అనుభవిస్తున్న వారి ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ తనిఖీల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరితో పాటు, నెలకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు భారీ వేతనాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరిట కూడా తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి ప్రత్యేకంగా కొత్త కార్డులు మంజూరు చేయించుకున్న వారిలో ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా ఉన్నారు. ఇన్నాళ్లు వీరంతా తమ తల్లిదండ్రుల రేషన్‌కార్డుల్లో సభ్యులుగా కొనసాగడం వల్ల వీరి అసలు వివరాలు, ఆదాయం బహిర్గతం కాలేదు. ప్రస్తుతం డేటా విశ్లేషణ ద్వారా వీరి గుట్టు రట్టవడంతో అలాంటి వారి కార్డులను అధికారులు తొలగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా నిబంధనల ప్రకారం.. - మిగతా5లో

## డీకే అరుణకు
# పార్టీ పగ్గాలు..

**మహబూబ్ నగర్, మే 26:** తెలంగాణాలో అధికారంలోకి రావాలని బీజేపీ భావిస్తోంది. 2028 ఎన్నికల్లో గెలిచి తీరాలని పట్టుదలగా ఉంది దాంతో సామాజిక రాజకీయ వ్యూహాలను అమలు చేస్తోంది. రెడ్డి జనాభా అధికంగా ఉన్న తెలంగాణా రాజకీయంగా వారి ప్రభావాన్ని గమనించి ఆ దిశగా వేగంగా పావులు కదుపుతోంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణతో పాటే తెలంగాణలో కొత్త బీజేపీ అధ్యక్షుడిని కూడా నియమించాలని చూస్తోంది. ప్రస్తుతం తెలంగాణా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రామచంద్రరావుని తప్పిస్తారని అంటున్నారు. దీంతో భారీ మార్పులకే బీజేపీ శ్రీకారం చుడుతోంది అని అంటున్నారు కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణా నుంచి ఇద్దరు మంత్రులు



ఉన్నారు. వారిలో ఒకరు బండి సంజయ్, ఆయన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు. మరొకరు కేబినెట్ ర్యాంక్ మంత్రిగా ఉన్నారు. ఆయనే కిషన్ రెడ్డి. అయితే ఇందులో - మిగతా5లో

# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల్లో సర్ సెగలు

దేశవ్యాప్తంగా పలు వివాదాలతో సంచలనం రేపుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) సెగ ఇక తెలుగు రాష్ట్రాలకు తాకనుంది. వేసవి కాలం ముగిసి తొలకరి రుతుపవనాలు ప్రవేశించే జూన్ నెలలో తెలంగాణలో 'సర్' వేడి మొదలుకానుంది. ఇప్పటికే దేశంలో రెండు దశల్లో ముగిసిన ఓటర్ల జాబితా ప్రక్షాళన తుది మూడో దశలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా మొత్తం 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపట్టనున్నారు. మొదటి రెండు దశల్లో పశ్చిమబెంగాల్, అసోం, బీహార్, తమిళనాడు, కేరళ, రాష్ట్రాల్లో అక్కడి అసెంబ్లీ ఎన్నికల ముందు 'సర్' ప్రక్రియ నిర్వహించడంతో ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు చాలా కాలం ఉన్నా రాష్ట్రంలో 'సర్' రాజకీయ వేడి పుట్టించింది. స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎలాంటి విమర్శలు ఎదుర్కోకుండా నిష్పక్షపాతంగా తెలంగాణలో 'సర్'ను విజయవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఓటర్లు కోరుకుంటున్నారు. కాలానుగుణంగా దేశంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. దేశంలో ఇంతకుముందు 195152, 1960, 1980, 1993, 1995, 2002 2004 సంవత్సరాల్లో దేశంలో 'సర్' ప్రక్రియ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను సవరించారు. 2025 26లో భాగంగా తొలుత బీహార్‌లో, అనంతరం 12 రాష్ట్రాల్లో 'సర్' నిర్వహించి, ఇప్పుడు చివరగా 16 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'సర్' చేపట్టేందుకు సిద్ధమైంది. ఓటర్ల జాబితాలో డూప్లికేట్, చనిపోయిన వారు, చిరునామా మారిన వారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నావారు, అర్హత లేని వారి పేర్లను తొలగించి ప్రక్షాళన చేయడమే 'సర్' లక్ష్యమని ఎన్నికల సంఘం పదేపదే చెబుతున్నా దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమియేతర పార్టీలు మాత్రం 'సర్' ప్రక్రియను 'ఎంపిక చేసిన ప్రక్షాళన'గా విమర్శిస్తున్నాయి. దీనిపై పలు రాజకీయ పార్టీలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాయి. 'సర్' ప్రక్రియ ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా నిర్వహించడం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపైన ఉంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని ఎన్నికల సంఘం చెబుతున్నా తెలంగాణలో రాజకీయ పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమ సందేహాలు, సూచనలు తెలియజేస్తున్నారు. పార్టీలు తమ నేతలను, కార్యకర్తలను 'సర్'పై జాగృతం చేశాయి. మొదటి రెండు దశ 'సర్' ప్రక్రియలో దాదాపు 7.2 కోట్ల ఓట్లు తొలగించబడ్డాయి. అదే సమయంలో సుమారు 2 కోట్ల మంది ఓటర్లను చేర్చారు. రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే బీహార్‌లో 65 లక్షలు (8.3%), ఉత్తరప్రదేశ్‌లో 2.5 కోట్లు (13%), తమిళనాడులో 97.3 లక్షలు (14%), పశ్చిమబెంగాల్‌లో 90 లక్షలు (11%), గుజరాత్‌లో 70 లక్షలు (14.5%), మధ్యప్రదేశ్‌లో 34.25 లక్షలు (6%), రాజస్తాన్‌లో 31 లక్షలు (5.7 చ), చత్తీస్‌గఢ్ లో 25 లక్షలు (11%) ఓట్లు 'సర్'లో తొలగించారు. మరోవైపు గోవా, లక్షద్వీప్, అండమాన్ నికోబార్‌లో పూర్తి గణాంకాలు వెల్లడి కాలేదు. సర్' ప్రక్రియ చేపట్టిన రాష్ట్రాల్లో ప్రధానంగా బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, అసోంలో వివాదాలు రేగాయి. బీహార్‌లో మొదట కోటి వరకు ఓట్లు తొలగిస్తారనే ప్రచారం జరిగినా రాజకీయ దుమారం, న్యాయస్థానాల జోక్యంతో చివరికి 65 లక్షల ఓట్లు రద్దు అయ్యాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్‌లో 'సర్' దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఉన్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు పారదర్శకత కోసం న్యాయమూర్తులను పరిశీలకులుగా నియమించి ప్రజాస్వామ్యంపై భరోసా కలిగించింది. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చింది. పశ్చిమబెంగాల్‌లో బిఎల్‌ఒలపై ఒత్తిడి పెరిగి దురదృష్టవశాత్తు కొంత మంది మరణించిన ఘటనలు కూడా జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల ముగిసిన తర్వాత కూడా ఇంకా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపు కేసులు న్యాయస్థానాల్లో ఉన్నాయి. తమిళనాడులో నాడు అధికారంలో ఉన్న డిఎంకె 97 లక్షల ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టింది. అసోంలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల అంశంతో 'సర్' సున్నితంగా మార్చింది. పలు రాష్ట్రాల్లో 'సర్' వివాదాస్పదమైన నేపథ్యం లో తెలంగాణలో కూడా ఎలా జరుగుతుందో అదే ఆందోళన కలగడం సహజమే. తెలంగాణలో 'సర్' నిర్వహణలో భాగంగా 2026 జూన్ 25 నుంచి జూలై 24 వరకు బిఎల్‌ఒలు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నారు. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది జాబితా అక్టోబర్ 1 లేదా అక్టోబర్ 10న విడుదల చేసే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పటికే ర్యాండవ్? మ్యాపింగ్ చేపట్టారు. 2002 ఓటర్ల జాబితాతో సరిపోలుస్తూ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 3.32 కోట్ల మంది ఓటర్లుండగా ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్ ఆధారంగా 50 లక్షలకుపైగా ఓటర్లు తగ్గవచ్చనే అంచనాలున్నాయి. ఎన్నికల సంఘం రూపొందించిన 'డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్' సాఫ్ట్‌వేర్‌తో బోగస్, డూప్లికేట్, రెండు చోట్ల ఉండే ఓట్లు తొలగించే వీలుంది. ప్రధానంగా గ్రేటర్ శివార్లలో, కొత్త కాలనీల్లో భారీగా ఓట్లు తొలగించడం, జోడించడం జరిగే అవకాశాలున్నాయి. బిఎల్‌ఒలు, ఎన్యూమరేటర్లు రెండు మూడు సార్లు వచ్చి మరీ తనిఖీలు చేసిన తర్వాతనే తుది జాబితాను రూపొందిస్తారు. ఓటరు రిసిప్ట్ కాపీని డిజిటల్ రికార్డులో భద్రపరుస్తారు. ఓటర్లు 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తమ రుజువుగా చూపించవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో 'సర్'లో కేంద్రబిందువుగా మారే అవకాశాలున్నాయి. నగరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఎపి నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారితోపాటు ఇతర దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు భారీగా ఉన్నారు. వీరిలో కొందరికి రెండు రాష్ట్రాల్లోనూ ఓట్లుండే అవకాశాలున్నాయి. మ్యాపింగ్‌లో ఓటర్లు కనిపించకపోవడంతో ఇక్కడ 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగింపు వివాదం కావచ్చు. నగరంలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు నకిలీ పత్రాలతో ఓటర్లుగా ఉన్నారనే ఆరోపణలున్న నేపథ్యంలో సదరు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు నెలకొనే అవకాశాలుంటాయి. సున్నిత ప్రాంతాల్లో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకొని 'సర్'ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరంలో మ్యాపింగ్ చేపట్టడంలో కొన్ని రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడంతో అనర్హులు విధులు నిర్వహిస్తున్నరనే ప్రచారం జరుగతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే తెలంగాణలో కూడా 'సర్' వివాదాస్పదమయ్యే అవకాశాలున్నాయి.ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఎన్నికల సంఘంతోపాటు రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పోలింగ్ బూత్ స్థాయిలో అధికారిక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ), రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్‌ఎ) పాత్ర క్రియాశీలకమైంది. తెలంగాణలో ఒక్కో బిఎల్‌ఒ పరిధిలో సగటున 930 మంది ఓటర్లున్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలోనే ఓటర్ల జాబితా రూపొందిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉంటే వివాదాలు అరికట్టవచ్చు. ప్రజాస్వామ్యానికి ఎన్నికల ప్రక్రియ పునాది. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకం. ఓటర్ల జాబితా ప్రక్షాళన 'సర్'పై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, పారదర్శకంగా ప్రక్రియ సాగితేనే ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. అనర్హులను తొలగించి అసలైన అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తే దేశంలో వివాదాస్పదం అవుతున్న 'సర్' నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. కాబట్టి 'సర్' ప్రక్రియ రాజకీయ వివక్ష లేకుండా నిజాయితీగా, పారదర్శకంగా జరిగితేనే ఎన్నికల సంఘం చెబుతున్న "ప్యూరిఫికేషన్"పై ప్రజల్లో "క్లారిఫికేషన్" వస్తుంది. 'సర్' అందరికీ సమ్మతం కావాలి. లేదంటే తెలంగాణలో కూడా 'సర్' మరో రాజకీయ తుపానుగా మారే అవకాశాన్ని కొట్టిపారేయలేం.

# తమిళనాడులో పుష్ప పాలిటిక్స్...

**చెన్నై, మే 26:**తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికలు ముగిసినా పొలిటికల్ హీట్ ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా అన్నాడీఎంకేకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు కోలుకోలేని బిగ్ షాక్ ఇచ్చారు. ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ పార్టీ సభ్యత్వంతో పాటు ఎమ్మెల్యే పదవులకు కూడా రాజీనామా చేశారు. అసెంబ్లీలో జరిగిన బలపరీక్ష సమయంలోనే ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన వీరు.. ఇప్పుడు అధికారికంగా ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మధురాంతకం ఎమ్మెల్యే మరగతం కుమరవేల్ నేతృత్వంలో.. పెరుందురై ఎమ్మెల్యే జయకుమార్, ధారాపురం ఎమ్మెల్యే సత్యభామలు చెన్నై సచివాలయంలో స్పీకర్ జె.సి.పి. ప్రభాకరన్‌ను కలిసి తమ రాజీనామా లేఖలను సమర్పించారు.ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన వెంటనే ఈ ముగ్గురు నేతలు విజయ్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ఆధవ్ అర్జునను నేరుగా కలిశారు. వారికి మంత్రి శాలువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. త్వరలోనే వీరు ముఖ్యమంత్రి విజయ్‌ను కూడా కలవనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యభామ మాట్లాడుతూ.. "తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం ఏర్పడిన 15 రోజుల్లోనే, తాము దివంగత ముఖ్యమంత్రి జయలలిత సుపరిపాలనను చూస్తున్నాం" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. దీనిపై మంత్రి ఆధవ్ అర్జున స్పందిస్తూ.. ముఖ్యమంత్రి విజయ్‌ను నమ్మి వచ్చిన మీకు ఇక అంతా మంచే జరుగుతుంది. మనమంతా ఇకపై ఒకే కుటుంబంగా ముందుకు సాగుతాం" అని హామీ ఇచ్చారు.ప్రస్తుతం అన్నాడీఎంకే పార్టీ రెండు వర్గాలుగా విడిపోయి తీవ్ర అంతర్గత విభేదాలతో సతమతమవుతోంది. ఒకవైపు ఎస్.పి. వేలుమణి, సి.వి. షణ్ముగం వర్గం.. ఎడప్పాడి పళనిస్వామితో తిరిగి చేతులు కలపడానికి రాయబారాలు, చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ వీడటం అన్నాడీఎంకేకు పెద్ద దెబ్బ అనే చెప్పాలి. ఈ ముగ్గురి రాజీనామాతో అసెంబ్లీలో అన్నాడీఎంకే ఎమ్మెల్యేల బలం 44కు పడిపోయింది. మొన్నటి బలపరీక్షలో విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చిన వీరు.. ఇప్పుడు నేరుగా టీవీకే గూటికి చేరడంతో సీఎం విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం మరింత పటిష్టంగా మారింది.తమిళనాడులో అన్నాడీఎంకే సాంప్రదాయ ఓటు బ్యాంకుకు ప్రత్యామ్నాయంగా



దూసుకొచ్చిన దళపతి విజయ్.. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీల నుండి వికెట్లను పడగొట్టడం ప్రారంభించారు. జయలలిత పాలనను విజయ్ ప్రభుత్వంలో చూస్తున్నామంటూ అన్నాడీఎంకే సీనియర్ నేతలే వ్యాఖ్యానించడం చూస్తుంటే, రాబోయే రోజుల్లో అన్నాడీఎంకే నుండి మరికొంత మంది నేతలు టీవీకే వైపు చూసే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# ఎన్నాళ్లు పెట్రో మంట...

**ముంబై మే 26:**పెంచుడు కార్యక్రమం దర్జాగా సాగిపోతోంది. జనాలకు కూడా అలవాటైపోతుంది. మొదట్లో మూడు రూపాయలు పెంచారు. ఆ తర్వాత 90 పైసలు వడ్డించారు. ఇప్పుడు ఏకంగా 2.84 రూపాయలు పెంచేశారు. ఇలా పెంచుకుంటూ పోవడం వల్ల సామాన్య జనం బతికే పరిస్థితి లేకుండా పోతోంది. ధరల స్థాయి నిరంతర పెరుగుతున్న నేపథ్యంలో మార్కెట్లో ప్రతి వస్తువు ధర కూడా ఆకాశంలో విహరిస్తోంది. పెట్రోల్ ధరల పెరుగుదలను సాకుగా చూపించి వ్యాపారులు ఇతర వస్తువుల ధరలు కూడా పెంచుతున్నారు. దీనివల్ల సగటు మనిషి బతకలేక పోతున్నాడు.సోమవారం ఉదయం నుంచి మన దేశంలో డీజిల్, పెట్రోల్ ధరలు మరింత పెరిగాయి. పెట్రోల్ పై 2.84.. డీజిల్ పై 2.86 రూపాయల ధర పెరిగింది. నష్టాలు వస్తున్నాయని సాకుగా చూపించిన దేశీయ చమురు రంగ సంస్థలు ధరలను విపరీతంగా పెంచాయి. ఈ ధరలు సోమారం ఉదయం నుంచి అమలులోకి వచ్చాయి. ఇప్పటికే మూడు విడతలుగా డీజిల్, పెట్రోల్ ధరలను చమురు రంగ సంస్థలు పెంచేశాయి.. ఇప్పుడు పెరిగిన దర ప్రకారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 102.12, లీటర్ డీజిల్ ధర 95.20కి




విక్రయిస్తున్నారు.. ముంబైలో లీటర్ పెట్రోల్ ధర 111.12, చెన్నైలో 107.77, విజయవాడలో 117.19, డీజిల్ 104.88, గుంటూరులో పెట్రోల్ 117.59, డీజిల్ 105.28, హైదరాబాదులో పెట్రోల్ 115.58, డీజిల్ 103.74 ధరలో లభ్యమవుతూ ఉంటుంది.మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం తగ్గినప్పటికీ.. ఉద్రిక్తతలు ఒకప్పటి మాదిరిగా లేకపోయినప్పటికీ.. చమురు సరఫరాలో ఊహించిన వేగం లేదు. పైగా అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గల్ఫ్ దేశాలు యుద్ధం వల్ల ఏర్పడిన లాస్ ను పూడ్చుకోవడానికి క్రూడ్ ఆయిల్ ధరలను పెంచేస్తున్నాయి. దీనివల్ల అన్ని దేశాలలో చమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కొన్ని దేశాలైతే చమురు వినియోగంలో అనేక షరతులు విధిస్తున్నాయి. ప్రజలను ఇష్టానుసారంగా వాడకూడదని సూచిస్తున్నాయి. దీంతో అన్ని రకాల సేవలు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి.ప్రపంచ వ్యాప్తంగా అన్ని వ్యాపారాలు చమురు ఆధారంగా సాగుతూ ఉంటాయి. చమురు ధరలు పెరిగితే చాలు ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగిపోతుంటాయి. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో సగటు జీవి బడ్జెట్ లెక్కలు మారిపోతున్నాయి. అందువల్లే యుద్ధం శాశ్వతంగా ముగిసి.. చమురు ధరలు సాధారణ స్థితికి రావాలని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారు. అయితే శాంతి చర్చల నేపథ్యంలో అటు ఇరాన్.. ఇటు అమెరికా పట్టు విడుపులకు పోతున్న నేపథ్యంలో పరిస్థితి ఎప్పుడు మునుపటి స్థితికి వస్తుందో అర్థం కావడం లేదు.

# పవన్ మార్క్ యాక్షన్ షురూ...

**రాజమండ్రి మే 26:**అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మళ్లీ యాక్టివ్ అయ్యారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకోవడం లేదు, నేతలపై వస్తున్న ఆరోపణలపై రియాక్ట్ కావడం లేదు అంటూ వస్తున్న విమర్శలకు చెక్ పెట్టే ప్రయత్నం గట్టిగానే చేసారు పవన్. అలాగే జనసేన ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కూడా టైం కేటాయిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన లైంగిక దోపిడీ ఆరోపణల వివాదం లో రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ ను తన వద్దకు పిలిపించుకున్న పవన్ కళ్యాణ్ చెడా మడా క్లాస్ పీకారని సమాచారం. శ్రీధర్ తనపై లైంగిక దోపిడీకి పాల్పడ్డారని ఒక మహిళా ఉద్యోగి చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఆమె వరుసగా కొన్ని వీడియోలు రిలీజ్ చేసి పవన్ కళ్యాణ్ తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. దీనిపై పవన్ కళ్యాణ్ కూడా ఎందుకు సైలెంట్ గా ఉంటున్నారు అంటూ విపక్షాలు కూడా దాన్ని రాజకీయం చేసే ప్రయత్నం చేసాయి. దీనిపై అన్ని నివేదికలు చెప్పించుకున్న తర్వాత శ్రీధర్ ని పిలిపించుకున్న పవన్ ఆయన వివరణ తీసుకున్నారు. నైతిక పరమైన అంశాల్లో ఇలాంటి ఆరోపణ వస్తే సహించేది లేదంటూ గట్టిగా చెప్పడం తో శ్రీధర్ తన విప్ పదవికి రాజీనామా చేశారు ఇక పోలవరం ఎమ్మెల్యే బాలరాజు సైతం ఆ మధ్య చంద్రబాబు పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీనిపై కూడా సీరియస్ అయిన పవన్ కళ్యాణ్ తన ఆఫీస్ లో బాలరాజు కి క్లాస్ పీకారు. కూటమి ప్రతిష్టను దెబ్బతీసే ఎలాంటి వ్యాఖ్యలు బహిరంగంగా చేయొద్దు అంటూ ఏవైనా విషయాలు ఉంటే పార్టీలోనే చర్చించాలి తప్ప లేనిపోని వివాదాలు సృష్టించొద్దని గట్టిగా చెప్పారు. చిర్రి బాలరాజు పై వస్తున్న ఆరోపణలకు నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలంటూ టైం ఇచ్చారు. గోదావరి జిల్లాలో వరుస పర్యటనలు మొదలుపెట్టారు పవన్. గోదావరి ప్రాంతంలో పవన్ కళ్యాణ్ కు జనసేనకు ఉన్న పట్టు



చాలా ముఖ్యమైనది. స్థానికంగా ఉన్న నాయకుల్లోనూ కార్యకర్తల్లోనూ జోష్ నింపడానికి పవన్ ఈ పర్యటన ఉపయోగించుకోబోతున్నారు. అలాగే పుష్కరాల పనులు నేపథ్యంలో రాజమండ్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరీక్షిస్తున్నారు. గత ఎన్నికల్లో కేవలం 24 సీట్లు పోటీ చేసిన జనసేనను రాబోయే ఎన్నికల్లో మరిన్ని ఎక్కువ సీట్లు కు పెంచేలా వ్యూహం అయితే రెడీ చేస్తున్నారు జనసేనాని. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి కలిసే పోటీ చేస్తుంది అని ఇప్పటికే పలుమార్లు హింట్ ఇచ్చారు పవన్. అయితే దీనిపై జనసేన క్షేత్రస్థాయి అభిమానుల్లో అసంతృప్తి ఉన్నమాట వాస్తవం అని పవన్ వరకూ నివేదికలు వెళ్లాయి. వాటిని దృష్టిలో పెట్టుకునే యువకులను, తనకున్న అభిమానులను, గ్రౌండ్ లెవెల్ కార్యకర్తలను సంతృప్తిపరిచేలా పవన్ కళ్యాణ్ తన పర్యటనలు రెడీ చేస్తున్నారు. అందుకే ఒకవైపు ఇలాంటి టూర్స్ వేస్తూనే మరోవైపు పార్టీలో ఆరోపణలు, వివాదాలు ఎదుర్కొంటున్న నాయకులకు క్లాసులు పీకుతూ పార్టీని రిపేర్ చేసే పనిలో పడ్డారు జనసేనాని.విపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని కామెంట్ చేయడం ఈజీయే కానీ ఎంత వద్దన్నా అధికారంలో ఉన్నప్పుడు ప్రజల్లో ఎంతో కొంత అసంతృప్తి అయితే ఉంటుంది. అందుకే కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని పవన్ తన పార్టీపై ప్రజల్లో భరోసా కల్పించే ప్రయత్నంలో పడ్డారని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

# కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు మారాలి..

- మొదటి పేజీ తరువాయి

ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో జర్నలిస్టులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ఆసక్తి గల జర్నలిస్టులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా యూనియన్ కృషి చేయాలని సూచించారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని జిల్లా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నాయకులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. యూనియన్‌పై ప్రతి సభ్యుడికి నమ్మకం కలిగే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రమశిక్షణతో పని చేస్తూ సంఘం పటిష్టతకు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో నిర్వహించనున్న సెమినార్లు, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలను హనుమకొండ జిల్లా యూనిట్‌తో పాటు




గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా సంఘం కృషి చేస్తుందని, సమస్యలు ఉంటే రాష్ట్ర నాయకత్వానికి నివేదించాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బోల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, రాష్ట్ర నాయకులు గాడిపెల్లి మధు, కంకణాల సంతోష్ పాల్గొన్నారు.

# పొలాల్లో పంట వ్యర్థాలు తగలేస్తే క్రిమినల్ కేసులు...

**రైతులకు కఠిన హెచ్చరిక**






**గీసుగొండ, మే 26 అక్షర సవాల్:** పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలే వ్యర్థాలను తగలబెట్టే రైతులపై ఇకపై కఠిన చర్యలు తప్పవని గీసుగొండ మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు హెచ్చరించారు. ఈరోజు జరిగిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ కమిషనర్, వ్యవసాయ శాస్త్రవేత్తల ఆదేశాల మేరకు మండల రైతాంగానికి ఆయన కీలక సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న, వరి కోతల సీజన్ ముగుస్తున్న తరుణంలో అనేక గ్రామాల్లో రైతులు పంట మోడులను పొలాల్లోనే విచక్షణారహితంగా తగలబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యలు పర్యావరణానికి మాత్రమే కాకుండా మానవ ఆరోగ్యానికి కూడా తీవ్ర హాని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంట వ్యర్థాలు కాల్చడం వల్ల వచ్చే దట్టమైన పొగ రహదారులపై కమ్ముకుని దృశ్యమానత తగ్గిపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, గ్రామాల్లో చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా భూమిలోని వానపాములు, మేలు చేసే సూక్ష్మజీవులు నశించి భూసారం శాశ్వతంగా దెబ్బతింటుందని ఆయన స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు విధించబడతాయని ఆయన హెచ్చరించారు. చీ+ు నిబంధనల ప్రకారం భూ విస్తీర్ణాన్ని బట్టి రూ.2,500 నుండి రూ.15,000 వరకు పర్యావరణ జరిమానా విధించబడుతుందని, అలాగే వాయు కాలుష్య నియంత్రణ చట్టం--1981 ప్రకారం 3 నెలల జైలు శిక్ష లేదా రూ.10,000 జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా భారతీయ న్యాయ సంహిత--2023 ప్రకారం ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి, రహదారి భద్రతకు ముప్పు కలిగించినందుకు 1 నుండి 6 నెలల వరకు జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. ఇకపై ఏ గ్రామంలోనైనా రైతులు పంట వ్యర్థాలను తగలబెడితే ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా రెవెన్యూ మరియు పోలీస్ శాఖల ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ వంటి సబ్సిడీలను శాశ్వతంగా నిలిపివేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. రైతులు పాత పద్ధతులను విడిచి రోటవేటర్, మల్చర్, సూపర్ సీడర్ వంటి ఆధునిక యంత్రాలను ఉపయోగించి పంట వ్యర్థాలను భూమిలో కలిపివేయాలని ఆయన సూచించారు. దీనివల్ల అవి సహజంగా కుళ్ళి సేంద్రీయ ఎరువుగా మారి భూసారాన్ని పెంచుతాయని, తద్వారా తదుపరి పంటకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీలు ఈ నిబంధనలను తప్పకుండా పాటించి వ్యవసాయ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



పి. హరి ప్రసాద్ బాబు
మండల వ్యవసాయ అధికారి
గీసుగొండ

# ఆదివాసి మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

**ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలి:మడే పూర్ణిమ**



**తాడ్వాయి, మే 26 అక్షర సవాల్:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కట్టు నర్సాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ నేడు పర్యటించారు. గ్రామంలోని ఆదివాసి మహిళలతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆమెకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల అభ్యున్నతికి అనేక ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుండి రూ.10 లక్షల వరకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా మహిళా రైతు బజార్ల ఏర్పాటు ద్వారా ఆదివాసి మహిళలు తాము పండించిన పంటలు, కూరగాయలు నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం అవసరమైన స్థలం, దుకాణాల ఏర్పాటు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. ఆదివాసి మహిళలు స్వయం ఉపాధి వైపు ముందుకు రావాలని, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలను పూర్తిగా వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. సమాజంలో ఆదర్శంగా నిలవడంతో పాటు నిత్యవసర సరుకుల సరఫరాలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపేలా ఆమె చేసిన ప్రసంగం గ్రామంలో ఉత్సాహాన్ని నింపింది.

# ధాన్యం కుప్ప వద్దే రైతు మృతి

**కుటుంబానికి న్యాయం చేయాలని రైతు సంఘాల డిమాండ్**

**అలంకానిపేట ఘటనపై ప్రభుత్వం తక్షణ సాయం చేయాలంటూ కలెక్టర్‌ను కోరిన రైతు సంఘాలు**



**నెక్కొండ, మే 26 అక్షర సవాల్:** నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామంలో గుండెపోటుతో రైతు గాజుల పెద్ద వెంకటేశ్వర్లు (62) మృతి చెందిన ఘటనపై ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని రైతు సంఘాల నాయకులు జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ నెల 17న ఐకెపి సెంటర్‌లోని వరి ధాన్యం కుప్ప వద్దే ఆయన గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందారని నాయకులు తెలిపారు. తన నాలుగు ఎకరాల భూమిలో మూడు ఎకరాల్లో పంట పండించి, సొసైటీ కొనుగోలు కేంద్రానికి 15 రోజుల క్రితమే ధాన్యం తీసుకువచ్చి ఆరబోసినప్పటి నుంచి రోజంతా అక్కడే ఉండాల్సి వచ్చిందని వారు వివరించారు. ఉదయం నుంచి రాత్రి 11--12 గంటల వరకు ధాన్యం వద్దే ఉండటం వల్ల ఎండ తీవ్రతను తట్టుకోలేక ఆయన ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. సొసైటీ అధికారుల నిర్లక్ష్యం, పంట కొనుగోలు ఆలస్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో తీసుకున్న పంట రుణం పెండింగ్‌లో ఉండగా, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కూడా అమలుకాలేదని వారు తెలిపారు. 62 ఏళ్ల వయస్సు కారణంగా రైతు బీమా పథకానికి కూడా అర్హత లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతు అప్పులను మాఫీ చేసి, మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వారు అదనపు కలెక్టర్ సంధ్యారాణి గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, అఖిలభారత కిసాన్ సంఘటన్ జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్, రైతు సంఘం జిల్లా నాయకులు మోకిడే పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి వికాసానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పెద్దపీట

**కాపులకానిపర్తిలో మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన..**

**గ్రామ స్థాయి నుండి ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు ఎదగాలి.**

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**





**గీసుగొండ, మే 26 అక్షర సవాల్:** సంగెం మండలం కాపులకానిపర్తి గ్రామంలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద గారితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు మాట్లాడుతూ, మహిళలను అన్ని రంగాల్లో అగ్రగాములుగా నిలపడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, సామాజిక ఉన్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆయన వివరించారు. హైదరాబాద్ సచివాలయం నుండి నిన్న వర్చువల్ విధానంలో 8,000 స్వయం సహాయక సంఘ భవనాలకు శంకుస్థాపన జరిగిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అనుగుణంగా ఆధునిక వసతులతో "ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాలు" నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు, రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి అవకాశాలను మహిళా సంఘాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. పరకాల నియోజకవర్గంలో ఇందిరా మహిళ డైరీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కాపులకానిపర్తి, ఆశాలపల్లి, కాట్రపల్లి, వెంకటాపురం గ్రామాల్లో ఈ మహిళా సమైక్య భవనాలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

# అభివృద్ధిని రాజకీయ రంగుతో చూడొద్దు....

**కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌పై బీజేపీ విమర్శలు నిరాధారమని కాంగ్రెస్ గట్టిగా ఖండన**

**ప్రజల ఉపాధి కోసం తీసుకొచ్చిన ప్రాజెక్టును వివాదాస్పదం చేయొద్దని హితవు**



**గీసుగొండ, మే 26 అక్షర సవాల్:** కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ విషయంలో బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరితమైనవేనని కాంగ్రెస్ నాయకులు గట్టిగా ఖండించారు. అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడటం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వివాదాస్పదం చేయడం దురదృష్టకరమని వారు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, స్థానిక ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. "విగ్రహ రాజకీయాలు" పేరుతో బీజేపీ చేస్తున్న ఆరోపణలు ప్రజల్లో అనవసర ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నమేనని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కాకతీయుల చరిత్ర, తెలంగాణ ఆత్మగౌరవంపై కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ గౌరవం ఉందని, రాష్ట్ర సంస్కృతిని కించపరిచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం మిత్ర పథకం పేరుతో ప్రచారం చేసుకుంటోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం భూముల సమీకరణ, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తోందని వారు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేలా రాజకీయ ఆరోపణలు చేయకుండా అందరూ సహకరించాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్రయపల్లి, మాజీ సర్పంచ్ ఆకుల రుద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబనకు బాటలు

**సంగెం మండలంలో మహిళా శక్తి వారోత్సవాల్లో మహిళా సమైక్య భవనాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**





**సంగెం, మే 26 అక్షర సవాల్:** ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సంగెం మండలంలోని గవిచర్ల రైతు వేదికలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా గవిచర్ల, తీగరాజుపల్లి, సోమ్లా తండా, పెద్ద తండా గ్రామాల్లో నిర్మించనున్న మహిళా సమైక్య భవనాలకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముందు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని తెలిపారు. మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ "కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం" లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. మహిళా సంఘాల వ్యవస్థను బలోపేతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, రైస్ మిల్లులు, మహిళా శక్తి సూపర్ బజార్ల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయిలో మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అనుగుణంగా ఆధునిక వసతులతో మహిళా భవనాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సంగెం మండల మహిళా సమైక్యకు బస్సు కొనుగోలు ద్వారా నెలకు సుమారు రూ.65 వేల ఆదాయం వస్తోందని ఆయన తెలిపారు. పరకాలలో మహిళా డైరీ ఏర్పాటు కూడా మహిళలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. "రేవంత్ అన్న నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. శంకుస్థాపనలు మేమే చేస్తాం, ప్రారంభోత్సవాలు కూడా మేమే చేస్తాం" అని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పాలన వల్ల రాష్ట్రం అప్పుల భారంలోకి వెళ్లిందని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి మహిళా సమైక్య భవనాలు కీలకంగా నిలుస్తాయని చెప్పారు.

# ఈద్-ఉల్-అదా పండుగ నేపథ్యంలో మత పెద్దలతో సమావేశం



**వరంగల్ క్రైమ్, అక్షర సవాల్ :** రానున్న ఈద్-ఉల్-అదా పండుగను ప్రశాంతంగా, సోదరభావంతో జరుపుకునేందుకు వరంగల్ మట్వాడా పోలీస్ స్టేషన్ పరిధిలో ముస్లిం మత పెద్దలతో సీఐ కర్ణాకర్ శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక మత పెద్దలు, కమ్యూనిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా సీఐ మాట్లాడుతూ, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అపోహలు, వివాదాలు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడవద్దని సూచించారు. పండుగ సందర్భంగా ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, రోడ్లపై ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కోరారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా ఘటనలు గమనించిన వెంటనే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగరంలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న కమ్యూనిటీ సభ్యులు శాంతి, సామరస్య పరిరక్షణకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఇంటి స్థలం వివాదంలో ఘర్షణ

## వ్యక్తి ఆత్మహత్యా యత్నం

**గీసుగొండ, మే 26 అక్షర సవాల్:** గీసుగొండ మండలం మంగళ తండా (దస్రు నాయక్ తండా) గ్రామ పరిధిలో ఇంటి స్థలం కొలతల విషయంలో జరిగిన వివాదం ఘర్షణకు దారితీసి, ఒక వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థల విక్రయం సంబంధించి గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం జరిగిన అనంతరం, 25-05-2026న స్థలం కొలతల సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో మాటల దూషణలు, తోపులాట జరిగినట్లు సమాచారం. అవమానానికి గురైన మనస్తాపంతో కేలోతు శ్రీధర్ అదే రోజు సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని నర్సంపేటలోని రాజేంద్రప్రసాద్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేలోతు కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించబడింది.

**ఇట్లు**
**డి. విశ్వేశ్వర్**
**సీఐ, గీసుగొండ**

# కోకాపేట కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు

## 22 ఎకరాల మేర కబ్జాలను తొలగించిన హైడ్రా

## ఖైతలాపూర్లోని రహదారి ఆక్రమణల తొలగింపు

**హైదరాబాద్, మే 26:** హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. చెరువుల ఆక్రమణలపై కన్నెర్రజేసిన హైడ్రా, రహదారిని ఆక్రమించి నిర్మించిన షెడ్డులను తొలగించింది. రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, కోకాపేట విలేజ్లోని కొత్త చెరువు ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఎఫ్టీఎల్ పరిధిలో దాదాపు 1.20 ఎకరాల వరకూ ఆక్రమించి గోల్డ్ ఫిష్ విల్లాస్ కోసం ప్లే ఏరియాలు, పార్కుల నిర్మాణం చేపట్టినట్లు గుర్తించారు. లి చెరువులో మరో 20 ఎకరాల మేర పలు నిర్మాణ సంస్థల ఆక్రమణలు జరిగాయి. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి చెరువును పలు నిర్మాణ సంస్థల ప్రతినిధులు కబ్జా చేసారు. లి హైడ్రాకు స్థానికుల నుంచి పెద్దయెత్తున ఫిర్యాదులు. చెరువును కాపాడాలంటూ వినతులు అందాయి. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖలతో కలిసి హైడ్రా పరిశీలించింది. కోకాపేట కొత్త చెరువు ఎఫ్టీఎల్ పరిధి మొత్తం 72 ఎకరాలు కాగా.. ఇందులో 22 ఎకరాల వరకూ ఆక్రమణలు జరిగినట్టు గుర్తించింది. ఆక్రమణలను నిర్ధారించుకున్నాక మంగళవారం రంగంలోకి దిగిన హైడ్రా, చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఆక్రమణలను తొలగించింది. ఫెన్సింగ్లతో పాటు.. రేకులతో ఏర్పాటు చేసిన ప్రహరీలను తొలగించింది.

# రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

## - సింధు జలాలు పూర్తిగా వినియోగంలోకి!

**న్యూ ఢిల్లీ మే 26 :** పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన కొన్ని నెలల తర్వాత, నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఇప్పుడు చినాబ్ నదికి సంబంధించిన రెండు ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇవి భారత్కు తన సొంత నీటి వనరుల వినియోగాన్ని బలోపేతం చేయడంతో పాటు ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రాజెక్టుల్లో ఒకటి హిమాచల్‌లో ఒక కీలకమైన సొరంగ ప్రాజెక్టు. దీనిని సరిగ్గా దశాబ్దం క్రితం అదే రాష్ట్రానికి చెందిన ఒక పరిశోధకుడు ప్రతిపాదించారు. ఈ క్రమంలోనే కేంద్రం ఆమోదించిన ప్రాజెక్టులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.కేంద్రం ఆమోదం తెలిపిన వాటిలో ఒకటి హిమాచల్ ప్రదేశ్‌లోని చినాబ్-బియాస్ లింక్ టన్నెల్ ప్రాజెక్ట్. దీని అంచనా వ్యయం రూ. 2352 కోట్లు. ఈ ప్రాజెక్ట్ కింద చినాబ్ నది నీటిని ఒక సొరంగం ద్వారా బియాస్ నదిలోకి మళ్లిస్తారు. చినాబ్ నీరు భారత్కు చెందినప్పటికీ, సింధు జలాల ఒప్పందం కారణంగా గతంలో పాకిస్థాన్‌కు ప్రవహించేది. అయితే ఆ ఒప్పందాన్ని నిలిపివేసిన తర్వాత ఈ కొత్త ప్రాజెక్ట్ ద్వారా భారత్ ఇప్పుడు ఆ నీటి నుంచి ప్రయోజనం పొందుతుందని నిపుణులు భావిస్తున్నారు.ఇక రెండో ప్రాజెక్ట్ జమ్మూ కశ్మీర్‌కు సంబంధించినది. ఇందులో భాగంగా సలాల్ డ్యామ్ ప్రాజెక్ట్ వద్ద పూడికతీత పనులు చేపడతారు. ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ. 268 కోట్లు. మొత్తం రూ. 2600 కోట్లకు పైగా విలువైన ఈ రెండు ప్రాజెక్టుల వల్ల హిమాచల్ ప్రదేశ్‌కు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. బియాస్ నది నిరంతరం ప్రవహించడంతో విద్యుత్ ఉత్పత్తి పెరిగి ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న హిమాచల్కు లాభం జరిగే అవకాశం ఉందని తెలిపారు.

**ప్రాజెక్ట్ పూర్తి వివరాలు**

చినాబ్- బియాస్ అనుసంధాన సొరంగ ప్రాజెక్ట్ హిమాచల్ ప్రదేశ్లోని లాహౌల్-స్పితి గిరిజన జిల్లాలో రానుంది. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్హెచ్‌పీసీ) చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో 8.7 కిలోమీటర్ల పొడవైన సొరంగం నిర్మాణం కూడా ఉంటుంది. ఇది పూర్తయిన తర్వాత చినాబ్ బేసిన్‌లోని అదనపు నీటిని హిమాచల్‌లోని బియాస్ నది వ్యవస్థలోకి మళ్లిస్తారు. ఈ సొరంగం రెండు బేసిన్‌ల మధ్య నదులను అనుసంధానించే ప్రాజెక్ట్లో కీలకం. చినాబ్ ఉపనది అయిన చంద్రభాగ నది నుంచి నీటిని జల నిర్మాణాలు, సొరంగాల ద్వారా బియాస్ బేసిన్ వైపు మళ్లిస్తారు. ఈ ప్రాజెక్టులో భాగంగా లాహౌల్ లోయలో చంద్ర నదిపై 19 మీటర్ల ఎత్తైన బ్యారేజీని నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. దీని మళ్లింపు కేంద్రం కోక్సర్ గ్రామం సమీపంలో ఉంటుంది.

**హిమాచల్‌కు చెందిన నిపుణుడి కృషి**

చినాబ్ ఉపనది చంద్రభాగ నదికి సంబంధించిన ఒక ఆలోచనను సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రవీణ్ శర్మ ప్రతిపాదించారు. పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందంలో మార్పుల కోసం నిరంతరం పోరాడుతున్న ఆయన, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తన ప్రతిపాదనలతో ప్రధానమంత్రి కార్యాలయానికి (పీఎంఓ), జలవనరుల మంత్రిత్వ శాఖకు సమర్పించారు.

# ఇంటి స్థలం వివాదం.. అవమానం భరించలేక గడ్డిమందు తాగిన వ్యక్తి

## గీసుగొండ మండలంలో ఘటన ,ఆరుగురిపై కేసు నమోదు

**గీసుగొండ, మే 26 అక్షర సవాల్:** గీసుగొండ మండల పరిధిలోని మంగళ తండా (దస్రు నాయక్ తండా) గ్రామంలో ఇంటి స్థలం కొలతల వివాదం ఘర్షణకు దారితీసి, అవమానం భరించలేక ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళ తండాకు చెందిన కేలోతు కవిత, ఆమె భర్త శ్రీధర్ తమకు ఉన్న ఇల్లు, ఇంటి స్థలాన్ని అప్పుల బాధల కారణంగా విక్రయించేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో గూగులోతు విజయ, జరుపుల మంగమ్మ అనే మహిళలు ఆ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ నెల 24న గ్రామ పెద్దల సమక్షంలో ఒక గుంట స్థలానికి రూ.2.60 లక్షల చొప్పున ధర



నిర్ణయించి, రూ.1 లక్ష అడ్వాన్స్‌గా చెల్లించినట్లు తెలిపారు. అనంతరం 25న మధ్యాహ్నం గ్రామ పెద్దలతో కలిసి స్థలం కొలతలు వేసి కొనుగోలుదారులకు అప్పగించే సమయంలో కేలోతు శ్రీను, కేలోతు పద్మ, జరుపుల మంగమ్మ, జరుపుల రమేష్, గూగులోతు విజయ, కేలోతు గోరి తదితరులు అక్కడికి చేరుకుని కవిత, ఆమె భర్త శ్రీధర్‌తో వాగ్వాదానికి దిగినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధితులను తీవ్ర పదజాలంతో దూషిస్తూ, అందరి ముందూ చెప్పులతో కొట్టినట్లు ఫిర్యాదులో వెల్లడైంది. ఈ అవమానాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీధర్ అదే రోజు సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన నర్సంపేటలోని రాజేంద్రప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని సమాచారం. బాధితురాలు కేలోతు కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# మహిళా శక్తి వారోత్సవాల్లో అంగన్వాడి భవనం ప్రారంభం

## కలెక్టర్ సత్య శారదతో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**సంగెం, మే 26 అక్షర సవాల్:** మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో నూతన అంగన్వాడి భవనాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య పరిరక్షణకు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రీ ప్రైమరీ స్కూళు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే డైట్ చార్జెస్ పెంపు, ఆధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా



ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య



సేవలు సమన్వయంతో అందించాల్సిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.

# ఐటిడిఏ పరిధిలోని సిఆర్టి, రెగ్యులర్ ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలని విజ్ఞప్తి

**ఏటూరునాగారం, మే 26 అక్షర సవాల్ :** ఉట్నూర్, భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేసినప్పటికీ, ఏటూరునాగారం ఐటిడిఏ పరిధిలో జనగాం జిల్లా ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల డిప్యూటేషన్ మాత్రం రద్దు చేయకపోవడం అనేక సందేహాలకు తావిస్తోందని గిరిజన సంఘం నేత చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఈ ఏప్రిల్ 20వ తేదీన జారీ చేసిన సర్క్యులర్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేయాలని స్పష్టంగా ఆదేశించింది. దీని ప్రకారం ఉట్నూర్, భద్రాచలం ఐటిడిఏల పరిధిలో డిప్యూటేషన్‌పై ఉన్న ఉపాధ్యాయులను వెంటనే వారి సొంత పాఠశాలలకు పంపించారు. అయితే ఏటూరునాగారం ఐటిడిఏ పరిధిలోని జనగాం జిల్లా ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్టి మరియు రెగ్యులర్ ఉపాధ్యాయుల డిప్యూటేషన్ మాత్రం ఇప్పటివరకు రద్దు చేయలేదు.ఇదే అంశంపై ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకే శాఖ పరిధిలో, ఒకే ఉత్తర్వుల అమలులో జిల్లాల వారీగా వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిప్యూటేషన్‌పై ఉన్న ఉపాధ్యాయులు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తూనే, వారి సొంత పాఠశాలల్లో ఖాళీలు పెరిగి విద్యార్థులకు బోధనలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. కమిషనర్ కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడంలో జాప్యం చేయడం వల్ల పరిపాలనాపరమైన అస్పష్టత నెలకొందని, ఇది గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల



నాయకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన విధానాన్ని ఏటూరునాగారం ఐటిడిఏ పరిధిలో మాత్రం ఎందుకు అమలు చేయడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తక్షణం స్పందించి, జనగాం జిల్లా ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై ఉన్న సిఆర్టి మరియు రెగ్యులర్ ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని, వారిని వారి సొంత పాఠశాలలకు వెంటనే పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. సమానత్వ సూత్రాలకు అనుగుణంగా, కమిషనర్ కార్యాలయ ఉత్తర్వులను ఏకరీతిగా అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జాన్పాకలో గుడుంబా విక్రయాలపై పోలీసుల దాడి...

**ఇద్దరిపై కేసు నమోదు**

**15 లీటర్ల నిషేధిత గుడుంబా స్వాధీనం**

**గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ హెచ్చరిక**

**గీసుగొండ, మే 26 అక్షర సవాల్:** గీసుగొండ మండలం జాన్పాక గ్రామంలో ప్రభుత్వ నిషేధిత గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి నిందితుల వద్ద ఉన్న గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బాదావత్ విజయ్ కుమార్ (22), తండ్రి రవి, కులం లంబడా, వృత్తి కూలీ, నివాసం జాన్పాక, గీసుగొండ, వరంగల్ మరియు బోడ సురేష్ (30), తండ్రి



బీక్య, కులం లంబాడా, వృత్తి కూలీ, నివాసం మంగళవారి పేట, ఖానాపూర్, ప్రస్తుతం జాన్పాక, వరంగల్ గా గుర్తించారు. వీరిద్దరూ తమ నివాసంలోనే గుడుంబా విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు పట్టుకుని తనిఖీ చేయగా 15 లీటర్ల ప్రభుత్వ నిషేధిత గుడుంబా లభ్యమైంది. పంచుల సమక్షంలో గుడుంబాను సీజ్ చేసి, ఇద్దరిపై చట్టపరమైన కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబా వినియోగం ఆరోగ్యానికి తీవ్ర హానికరమని పోలీసులు హెచ్చరించారు. ఎవరైనా గుడుంబా తయారీ లేదా విక్రయాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ స్పష్టం చేశారు.

# గ్రీన్ సిటీలో ఇనుప సామాను చోరీ

## గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**గీసుగొండ, మే 26 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని గ్రీన్ సిటీ గొర్రెకుంట లేబర్ కాలనీలో ఇనుప సామాను చోరీ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాది డక్క మనోహర్ (33), తండ్రి కుమారస్వామి, ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ గ్రీన్ సిటీ లేబర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. 25-05-2026 అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు ఆయన ఇంటి ఆవరణలో ఉన్న మోటార్ వాల్, సెంట్రింగ్ ఐరన్ పైపులు, బకెట్లు, రాతేండి గిన్నెలు, ఐరన్ రాడ్లు దొంగిలించారు. చోరీకి గురైన వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.10 వేలుగా అంచనా వేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు గీసుగొండ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# రూపాయి పతనం...ఎవరికి భారం...

అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారత రూపాయి విలువ తీవ్రంగా పతనం అవుతోంది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఇక రూపాయి పథనం విదేశాల్లో చదువుతున్న లక్షలాది భారతీయ విద్యార్థుల జీవితాలను గణనీయంగా ప్రభావితం చేస్తోంది. 'టూ గుడ్ టు గో' అనే యాప్‌లో ఆఖరి నిమిషంలో దొరికే ఈ ఆహారం కోసం విద్యార్థులుగా తాము స్టోర్లకు పరుగు పెట్టాలని, ఒక్క క్షణం ఆలస్యమైనా మరొకరు దాన్ని సొంతం చేసుకుంటారని మాన్వి కోలి చెబుతోంది. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఈ ఏడాది మార్చిలో భారత్‌కు తిరిగి వచ్చిన ఆమె, సుమారు మూడు నెలల పాటు ఇలా గడువు ముగియడానికి సిద్ధంగా ఉన్న ఆహారంతోనే కడుపు నింపుకున్నానని చెప్పింది. అప్పుడు డాలర్‌తో రూపాయి విలువ 93 దాటగా, ఇప్పుడు 95 దాటి ఎప్పుడైనా 100 మార్కును తాకొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రూపాయి పతనం విదేశీ విద్యార్థుల జీవితాలను ఎంత కఠినంగా మార్చిందో మాన్వి మాటలు అద్దం పడుతున్నాయిప్రస్తుతం ఒక డాలర్‌కు 95--96 రూపాయలుగా ఉంది. ఇదియూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఫీజు, హాస్టల్, జీవన వ్యయాలను భారీగా పెంచేసింది. డిస్కౌంట్ ఆహారం కొనడం, దూరాలు నడవడం, టాప్--అప్ లోన్లు తీసుకోవడం, కొందరు స్టేషన్లలో శుభ్రతా పనులు చేయడం వంటి చర్యలు సాధారణమవుతున్నాయి. 2025లో సుమారు 12 లక్షలకు పైగా భారతీయ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. అయినప్పటికీ, రూపాయి బలహీనత వల్ల ఖర్చులు 5--10 శాతం పెరగడంతో చాలా మంది తమ బడ్జెట్‌ను పునరాలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూఎస్‌లో 40 వేల డాలర్ల సెమిస్టర్ ఫీజు కొన్ని సంవత్సరాల క్రితం 30 లక్షలు రూపాయలు అయితే, ప్రస్తుతం దాదాపు 38 నుంచి 40 లక్షల రూపాయలకు చేరుతోంది. ఇది మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఎత్తున ఒత్తిడి తెస్తోంది. చాలా మంది విద్యార్థులు ఎడ్యుకేషన్ లోన్లపై ఆధారపడి చదువుతున్నందున, రూపాయి పతనం రుణ మొత్తాన్ని పెంచుతోంది. సెమిస్టర్--వారీ ఫీజు చెల్లింపుల సమయానికి అసలు లోన్ సరిపోకపోవడంతో టాప్--అప్ లోన్లు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో వడ్డీ భారం కూడా పెరుగుతోంది. జీవన వ్యయాలు (ఆహారం, రవాణా, పుస్తకాలు) కూడా డాలర్/పౌండ్ ఆధారితమైనందున, నెలవారీ ఖర్చులు గణనీయంగా ఎగిస్తున్నాయి. విదేశాల్లో ఉన్న యువతలో చాలా మంది తమ ఖర్చులను తగ్గించుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. ఎక్స్‌పైరీ డేట్ దగ్గరలో ఉన్న




ఆహారాన్ని డిస్కౌంట్ ధరలకు కొనుగోలు చేయడం, యూనివర్సిటీ క్యాంపస్ నుంచి దూరంగా ఉంటూ కాలినడకన వెళ్లడం, పార్ట్--టైమ్ జాబ్స్ (కొన్ని సందర్భాల్లో శుభ్రతా పనులు కూడా) చేయడం సాధారణం అవుతోంది. ఇది వారి చదువు, ఆరోగ్యం, మానసిక స్థితిని కూడా ప్రభావితం చేస్తోంది. ఈ పరిస్థితి మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులను మరింత ఎక్కువగా బాధిస్తోంది. తల్లిదండ్రులు ఇంట్లో ఇతర ఖర్చుల మధ్య ఈ భారాన్ని మోయాల్సి వస్తోంది. రూపాయి పతనానికి అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు, డాలర్ బలం, విదేశీ ఇన్వెస్టర్ల నమ్మకం, వాణిజ్య లోటు వంటి అనేక కారణాలు ఉన్నాయి. దీని ప్రభావం విదేశీ విద్య మీద మాత్రమే కాక, దేశంలోని దిగుమతులు, ద్రవ్యోల్బణం, సాధారణ ప్రజల జీవన వ్యయం మీద కూడా పడుతోంది. విదేశీ విద్యపై ఆధారపడటం సవాళ్లను ఈ పరిస్థితి ఎత్తి చూపుతోంది. ఒకవైపు ప్రపంచ స్థాయి విద్య కోసం వెళ్తున్న యువత, మరోవైపు ఆర్థిక అస్థిరత వల్ల కలిగే కష్టాలు. ఇది దేశానికి పెద్ద సవాల్. రూపాయి పతనం ఒక ఆర్థిక సూచిక మాత్రమే కాదు. విదేశీ విద్య అనగానే అందరూ ఊహించుకునే రంగుల ప్రపంచానికి, వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. రూపాయి విలువ పడిపోతుండటంతో భారతీయ విద్యార్థులు కనీస అవసరాల కోసం తీవ్రంగా బడ్జెట్ వేసుకోవాల్సి వస్తోంది. పార్ట్‌టైమ్ ఉద్యోగాలతో పాటు డిపార్ట్‌మెంటల్ స్టోర్లు, రైల్వే స్టేషన్లలో ఫ్లోర్ క్లీనింగ్ వంటి పనులు చేయడం, రోజుకు ఒక్కపూట భోజనంతో సరిపెట్టుకోవడం, కొన్నిసార్లు పస్తులుండటం వంటివి సాధారణమయ్యాయి. డిస్కౌంట్లు, రేషన్ సరుకులు, కిరాణా బిల్లులను జాగ్రత్తగా పంచుకోవడం వారి దైనందిన జీవితంలో భాగమైంది. ప్రజా రవాణా, ఖరీదైన క్యాబ్ రైడ్‌లకు బదులుగా కిలోమీటర్ల కొద్దీ నడవడం పరిపాటిగా మారింది"విదేశాల్లో చదువుకునే అవకాశం వచ్చిన ప్రతి ఒక్కరూ సంపన్న కుటుంబం నుంచి రారు. స్కాలర్‌షిప్‌లపై వచ్చేవారు, తల్లిదండ్రులు ఇళ్లు తాకట్టు పెట్టి చదివించే మధ్యతరగతి కుటుంబాల వారే ఎక్కువ" అని మహారాష్ట్రకు చెందిన మాన్వి వివరించారు. ఎడ్యుకేషన్ లోన్ తీసుకుని చదివిన ఆమె, బడ్జెట్ వేసుకునేటప్పుడు రూపాయి విలువ మార్పును పరిగణనలోకి తీసుకోకపోవడం పెద్ద తప్పని అన్నారు. "నేను భారత్ విడిచి వెళ్లినప్పుడు డాలర్ విలువ రూ. 85 ఉంటే, తిరిగి వచ్చేసరికి రూ. 93కి చేరింది" అని ఆమె తెలిపారురూపాయి పతనం విద్యార్థులపై రెండు రకాలుగా ప్రభావం చూపుతోంది. మొదటిది, ట్యూషన్ ఫీజులు, నివాస ఖర్చులు రూపాయిలలో పెరిగిపోవడం. రెండోది, భారత్‌లో తీసుకున్న విద్యా రుణాలు సరిపోకపోవడం. చాలా విదేశీ యూనివర్సిటీలు సెమిస్టర్ల వారీగా ఫీజులు వసూలు చేస్తాయి. రూపాయి విలువ పడిపోవడంతో, తర్వాతి సెమిస్టర్లకు కట్టాల్సిన ఫీజుకు పాత లోన్ సరిపోవడం లేదు. దీంతో కుటుంబాలు అదనపు భారాన్ని మోయలేక 'టాప్-అప్ లోన్లు' తీసుకోవాల్సి వస్తోంది. ఇది వేలాది యువతల కలలు, కుటుంబాల త్యాగాలు, దేశ భవిష్యత్తుపై పడుతున్న ఒత్తిడి. విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థులు కేవలం వ్యక్తులు కాదు వారు దేశ మేధా సంపద. వారి కష్టాలను తగ్గించడం, దేశీయ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, ఆర్థిక స్థిరత్వం కోసం సమగ్ర విధానాలు రూపొందించడం ద్వారా మాత్రమే ఈ సవాలును అవకాశంగా మార్చుకోవచ్చు. ఈ ఆర్థిక ఒత్తిడి విద్యార్థుల చదువుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ అనీషా గుప్తా అన్నారు. "పూట గడవడమే కష్టంగా ఉన్నప్పుడు, చదువుపై ఎలా దృష్టి పెట్టగలరు? నిరంతరం ఖర్చుల గురించి ఆలోచిస్తూ ఒత్తిడికి గురైతే, అకడమిక్‌గా రాణించడం అసాధ్యం" అని ఆమె స్పష్టం చేశారు. ఒకే గదిలో నలుగురైదుగురు సర్దుకుపోవడం, భోజనం మానేయడం వంటివి పాశ్చాత్య దేశాల్లోని వారికి షాకింగ్‌గా ఉంటాయని, కానీ ఇక్కడ ఇదే వాస్తవమని ఆమె తెలిపారు. డాలర్‌కు రూపాయి విలువ 100కు చేరువ కావడం కేవలం ఆర్థిక గణాంకం కాదు. ఇది విదేశాల్లోని లక్షలాది మంది భారతీయ విద్యార్థుల ఆకలిని, వారి కుటుంబాల ఆందోళనను, వారి భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితిని ప్రతిబింబిస్తోంది. మెరుగైన భవిష్యత్తు కోసం దేశం విడిచి వెళ్లిన వారి కలలను కరెన్సీ కష్టాలు కబళిస్తున్నాయి.

# UIDAI కీలక నిర్ణయం.. అదిరిపోయే ఫీచర్స్‌తో ఆధార్ కొత్త యాప్..

**ఇంటర్నెట్ డెస్క్:** యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ప్రజలు వినియోగిస్తున్న పాత 'హెూఖుంష్త్రుఖుతీ' యాప్‌ను త్వరలో పూర్తిగా నిలిపివేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి బదులుగా మరింత భద్రత, గోప్యత, స్మార్ట్ ఫీచర్లతో కూడిన కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఈ విషయాన్ని ఆధార్ అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. 'హెూఖుంష్త్రుఖుతీ త్వరలో డిస్కంటిన్యూ అవుతుంది. కొత్త ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వేగవంతమైన సేవలు, స్మార్ట్ ఫీచర్లు పొందండి' అని పేర్కొంది.

**కొత్త ఆధార్ యాప్ ప్రత్యేకతలు..**

కొత్త యాప్‌ను కేవలం డిజైన్ మార్పులతో మాత్రమే కాకుండా ఆధార్ వినియోగ విధానాన్ని పూర్తిగా మార్చేలా రూపొందించారు. ముఖ్యంగా వ్యక్తిగత సమాచారం భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

**QR ఆధారిత ఆధార్ షేరింగ్..**

కొత్త యాప్‌లో 'సెక్యూర్ క్యూఆర్ కోడ్ షేరింగ్' అనే అత్యంత కీలకమైన ఫీచర్‌ని తీసుకొచ్చారు. హోటళ్లు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి చోట్ల ఆధార్ చూపించాల్సి వచ్చినప్పుడు ఇక పూర్తి వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదు.




అవసరమైన సమాచారాన్ని మాత్రమే క్యూఆర్ కోడ్ ద్వారా సురక్షితంగా షేర్ చేయవచ్చు.

**ఫేస్ అథెంటికేషన్..**

ఇప్పటివరకూ ఆధార్ యాక్సెస్ కోసం ప్రధానంగా ఓటీపీలపైనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ, కొత్త యాప్‌లో ఓటీపీతోపాటు ఫేస్ అథెంటికేషన్, క్యూఆర్ వెరిఫికేషన్ వంటి అదనపు భద్రతా వ్యవస్థలను ప్రవేశపెట్టారు. దీంతో ఆధార్ దుర్వినియోగం తగ్గుతుందని UIDAI భావిస్తోంది.

**యూజర్‌కే పూర్తి నియంత్రణ..**

కొత్త ఆధార్ యాప్ ద్వారా వినియోగదారులు తమ ఫింగర్ ప్రింట్, ఫేస్, ఐరిస్ బయోమెట్రిక్ వివరాలను నేరుగా లాక్ చేయడం లేదా నిర్వహించడం చేయవచ్చు. ముఖ్యంగా పబ్లిక్ లేదా షేర్డ్ డివైస్‌లలో అక్రమ యాక్సెస్‌ను తగ్గించేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

**కొత్త ఆధార్ యాప్ ఎలా సెటప్ చేయాలి?**

1. గూగుల్ ప్లే స్టోర్ లేదా అధికారిక యాప్ స్టోర్ నుంచి ఆధార్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
2. యాప్ ఓపెన్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి.
3. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ నమోదు చేయాలి.
4. ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయాలి.
5. అవసరమైతే ఫేస్ అథెంటికేషన్ వంటి అదనపు వెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

దేశవ్యాప్తంగా డిజిటల్ ఐడెంటిటీ సేవలను మరింత సురక్షితంగా, సులభంగా మార్చేందుకు ఖ×ణూ× ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా వ్యక్తిగత డేటా రక్షణ, ఆధార్ వినియోగంలో పారదర్శకత, మోసాలను తగ్గించడం లక్ష్యంగా కొత్త యాప్‌ను రూపొందించారు.

# హైదరాబాద్‌పై కేటీఆర్ వ్యూహాత్మక గాలం

- మొదటి పేజీ తరువాయి

ఇచ్చారు. మిషన్ భగీరథ ద్వారా ఇప్పటికే ఇంటింటికీ పైప్‌లైన్ కనెక్షన్లు ఇచ్చామని, 24 గంటల నీటి సరఫరా బాధ్యతను స్వయంగా తానే భుజాన వేసుకుంటానని ప్రకటించడం ద్వారా నగర ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నాటి కరెంటు కోతలు, నీటి కొరతలను ప్రజలకు గుర్తు చేస్తూ నాటికీ, నేటికీ ఉన్న వ్యత్యాసాన్ని విశ్లేషించారు. గడిచిన రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ నగరానికి ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసమర్థ ప్రభుత్వంగా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఫ్లైఓవర్లు, టిమ్స్ ఆసుపత్రుల రిబ్బన్లు కట్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని ఆరోపించారు. గడిచిన రెండున్నర సంవత్సరాలలో హైదరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. ఒకవేళ ఒక్క ఇల్లయినా నిర్మించినట్లు నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళలకు 2500 రూపాయల సాయం, పెన్షన్ల పెంపు వంటి అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ ప్రతి వర్గాన్ని మోసం చేసిందని, అందుకే అవగాహన ఉన్న హైదరాబాద్ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ పాలన వల్ల పూర్తిగా దెబ్బతిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు, సెంట్రింగ్ కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే ఈ కార్మికుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యంతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ప్రకటించడం ద్వారా నగరంలోని వలస, కార్మిక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునే వ్యూహాన్ని అమలు చేశారు. గత పదేళ్లలో అభివృద్ధిపైనే పూర్తి ఫోకస్ పెట్టామని, ఈసారి అధికారంలోకి వస్తే కష్టపడిన కార్యకర్తలకు, నేతలకు పూర్తి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు

# మహిళా సంఘాలకు కార్పొరేట్ స్థాయి బలం

- మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. తొలి విడతగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గ కేంద్రాల్లో అవసరమైన స్థలాలను గుర్తించి మహిళా సంఘాలకు స్వల్ప అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, సూపర్ బజార్ల కోసం అవసరమైన భూములను గుర్తించడంపై దృష్టి సారించాలని సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రారంభ నిధులు అందిస్తుందని, మహిళలు కూడా భాగస్వామ్య పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. మహిళలు ప్రస్తుతం పెద్ద ఎత్తున చైన్ సూపర్ మార్కెట్లలో కొనుగోళ్లు చేస్తున్న నేపథ్యంలో, నాణ్యమైన నిత్యావసర వస్తువులు లభించే విశ్వసనీయ గుర్తింపుగా మహిళా శక్తి బజార్లను తీర్చిదిద్దాలని సీఎం ఆకాంక్షించారు. దేశంలోనే అత్యుత్తమ సూపర్ బజార్లుగా ఇవి ఎదగాలని ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇక ప్రతి మండలంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, సరుకు రవాణా కేంద్రాలు, భారీ గిడ్డంగులు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా తీసుకుంటామని, బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీ రుణాల అనుసంధానం కల్పిస్తామని స్పష్టం చేశారు. కొంతమంది మిల్లర్లు, దళారులు ప్రభుత్వ వ్యవస్థను మోసం చేస్తున్నారని పేర్కొన్న సీఎం, మహిళలకు బాధ్యతలు అప్పగిస్తే జవాబుదారీతనం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో మండలాల వారీగా పెద్ద గిడ్డంగులు నిర్మించి ధాన్యాన్ని అక్కడే భద్రపరచే విధానం తీసుకురావాలని, మిల్లర్లు మహిళా సంఘాల నుంచే ధాన్యం సేకరించే వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని సీఎం అన్నారు. మహిళలను స్వశక్తిపై నిలబెట్టేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలకు అందించనున్న ఇందిరమ్మ చీరల నమూనాలను కూడా సీఎం ఈ సందర్భంగా విడుదల చేశారు. 2034 నాటికి రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళలందరినీ సొంత సోదరీమణులుగా భావిస్తూ రాష్ట్ర మంత్రిమండలి పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో రేషన్ కార్డుల ఏరివేత...

- మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారుల వార్షిక ఆదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువగా ఉండి, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి కార్డులను తక్షణమే రద్దు చేస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి లేదా 7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉన్న వారి రేషన్ కార్డులను కూడా ఏరివేస్తున్నారు. ప్రభుత్వ విచారణతో ఇన్నాళ్లూ లబ్ధి పొందిన అనర్హులైన కార్డుదారుల్లో ప్రస్తుతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అనర్హుల ఏరివేత ప్రక్రియలో నిజమైన పేదలకు, అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పంపిన లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలో సాంకేతిక పొరపాట్ల వల్ల కొందరు అర్హుల పేర్లు కూడా నమోదయ్యాయి. వార్షిక ఆదాయం రూ. 6 లక్షలుగా తప్పుగా చూపిస్తున్న వారి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలిస్తున్నారు. మరికొందరు లబ్ధిదారులు బ్యాంకుల నుంచి వ్యాపార, వ్యక్తిగత రుణాలు పొందటం కోసం ఐటీ రిటర్న్‌లో లేని ఆదాయాన్ని ఉన్నట్లుగా చూపించినట్లు విచారణలో వెల్లడైంది. ఇలాంటి వారికి అధికారులు నేరుగా ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారులు చెప్పిన సమాధానాలు, వారు సమర్పించిన పత్రాలపై విచారణ అధికారి సంతృప్తి చెందితే వారి కార్డులను యథావిధిగా కొనసాగిస్తున్నారు. అనుమానాస్పద కార్డుల విషయంలో అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారు చెప్పిన సమాచారం వాస్తవమా కాదా అనే అంశాన్ని అన్ని కోణాల్లో ఆరా తీస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

# డీకే అరుణకు పార్టీ పగ్గాలు..

- మొదటి పేజీ తరువాయి

బండిని తప్పిస్తారు అన్న ప్రచారం అయితే ఊపందుకుంది. ఆయన ప్లేస్ లో కొత్తగా ఒకరిని తీసుకోవాలని చూస్తున్నారు. నిజామాబాద్ కి చెందిన ధర్మపురి అరవింద్ కి కేంద్ర మంత్రిగా చాన్స్ దక్కుతుందని అంటున్నారు. బండి సామాజిక వర్గానికి చెందిన వారితోనే ఆ పోస్టుని భర్తీ చేయడం ద్వారా ఆ సామాజిక వర్గానికి న్యాయం చేసినట్లు అవుతుందని లెక్క వేస్తున్నారుట. ఇక బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరి ఒకసారి ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మరోసారి మల్కాజ్ గిరీ నుంచి ఏకంగా ఎంపీగా గెలిచిన ఈటెలకు తెలంగాణా రాజకీయాల్లో పాతికేళ్ళకు పైగా అనుభవం ఉంది. కేసీఆర్ మంత్రివర్గంలో ఆయన కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. అలాంటి ఆయనకు బీజేపీలో అయితే పెద్దగా పదవులు దక్కింది లేదు. రాష్ట్ర పగ్గాలు ఇస్తారనుకుంటే అదీ లేదు. దాంతో ఆయన వర్గం ఒకింత అసంతృప్తిగా ఉందని అంటున్నారు. దాంతో ఈటెలకు మంత్రి పదవి ఇస్తారు అని అంటున్నారు. త ద్వారా బీజేపీలోకి వచ్చిన వారికి పార్టీ సమాదరిస్తుంది అన్న సందేశాన్ని పంపిస్తారు అని అంటున్నారు. ఇక కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి విషయంలో కూడా కీలక నిర్ణయం తీసుకోబోతున్నారు అని అంటున్నారు. ఆయన శాఖను మారుస్తారు అని అంటున్నారు. కేబినెట్ ర్యాంక్ తో ఆయనకు మరో ముఖ్య శాఖను అప్పగిస్తారు అని అంటున్నారు ఇక కేంద్ర మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న మహబూబ్ నగర్ ఎంపీ సీనియర్ నాయకురాలు అయిన డీకే అరుణకు కూడా సమ ప్రాధాన్యత ఇస్తారని అంటున్నారు. ఆమెని తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ గా తీసుకుంటారు అని అంటున్నారు. తద్వారా ఆమె దూకుడు రాజకీయంతో పార్టీని మరింతగా బలోపేతం చేసుకోవచ్చు అన్నది కమలనాథుల ఆలోచనగా చెబుతున్నారు ఇక డీకే అరుణ చూస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వారు. రేవంత్ రెడ్డి సొంత జిల్లాకు చెందిన ఆమె ఢీ అంటే ఢీ అంటూ రేవంత్ రెడ్డితో ఇప్పటికే పోటీ పడుతున్నారు. ఆమెకు కనుక కీలకమైన తెలంగాణా బీజేపీ అధ్యక్ష పీఠం అప్పగిస్తే పార్టీ పరుగులు తీస్తుందని రేవంత్ రెడ్డి కి సరైన ప్రత్యర్థిని ఎంపిక చేసినట్లు అవుతుందని బలమైన రెడ్డి సామాజిక వర్గాన్ని కూడా తమ వైపునకు తిప్పుకున్నట్లు అవుతుందని అంటున్నారు. మొత్తానికి తెలంగాణాలో బీజేపీ ప్రక్షాళనకు కేంద్ర పెద్దలు నిర్ణయించారు అని అంటున్నారు ఈ మేరకు రాష్ట్ర పార్టీ నేతలను పిలిపించుకుని మరీ చర్చిస్తున్నారు అని అంటున్నారు.

# వర్కింగ్ ఉమెన్ భద్రత సంరక్షణ ప్రభుత్వ బాధ్యత..

- మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు ఎదుగుతుంటే కొందరు సహించలేక విమర్శలు చేస్తున్నారని, కానీ మహిళల శక్తి ముందు అలాంటి విమర్శలు నిలవవని అన్నారు. మహిళా అభ్యున్నతిని ఓర్చుకోలేని విపక్షాలకు మహిళలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచిందని తెలిపారు. మహిళా సంఘాలకు రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు, మహిళా సూపర్ మార్కెట్లు వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు ఖర్చులకోసం కోసం ఇతరులను ఆశ్రయించే స్థితి నుంచి.. ఇంటి ఖర్చులు భరించే స్థాయికి, పిల్లల చదువు బాధ్యతలు చూసుకునే స్థాయికి, నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలను తీసుకెళ్తున్నామని అన్నారు. సంపద సృష్టించే శక్తిగా మహిళలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని, రాష్ట్రం సంపన్నమవుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంట్లను బుధవారం నాడు ప్రారంభించనున్నామని, మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభిస్తామని జూన్ 5న మహిళలకు ఆర్టీసీ బస్సులను సీఎం రేవంత్ రెడ్డి అందజేస్తారని మంత్రి సీతక్క వెల్లడించారు. మహిళా ఉన్నతే తెలంగాణ ప్రగతి అని, గ్రామ గ్రామాన మహిళలు సాధిస్తున్న విజయాలను సమాజానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చా

# టీమ్ 2029...

- మొదటి పేజీ తరువాయి



మోదీ ప్లే చేయబోతున్నారు. ఇప్పటికే శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి వారు కేబినెట్‌లో ఉండగా, మరో ఇద్దరు లేదా ముగ్గురు మాజీ సీఎంల పేర్లు ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిని కేబినెట్ స్థాయి హోదాతో కీలక మంత్రిత్వ శాఖలకు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. వీరిలో ఇప్పటికే రాజీనామా చేసిన నితీష్ కుమార్ తో పాటు మరో ఇద్దరు ముగ్గురు ముఖ్యమంత్రుల్ని మార్చి మరీ కేంద్రానికి తీసుకువస్తారని అంటున్నారు. 2026 మే నెలలో జరగబోయే ఈ మార్పులను రాజకీయ వర్గాలు 'మిడ్-టర్మ్ రీసెట్'గా అభివర్ణిస్తున్నాయి. పనితీరు సరిగా లేని మంత్రులను సాగనంపి, వచ్చే సాధారణ ఎన్నికల నాటికి పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేసే దిశగా కొత్త ముఖాలను ప్రవేశపెట్టబోతున్నారట. కేవలం సీనియర్లే కాకుండా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బాగా పనిచేసిన యువ నేతలకు, అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు చెందిన నేతలకు ఈసారి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచడం ద్వారా 2029 ఎన్నికల లక్ష్యంగా అడుగులు వేయాలని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది. ప్రస్తుతం కొందరు మంత్రులు రెండు మూడు శాఖలను నిర్వహిస్తున్నారు. ఈ అదనపు బాధ్యతలను తగ్గించి, ప్రత్యేకంగా ఒక్కో శాఖకు ఒక్కో మంత్రిని కేటాయించేలా ప్లాన్ చేస్తున్నారు. రక్షణ, హోమ్, ఆర్థిక వంటి కీలక శాఖల్లో మార్పులు ఉండకపోవచ్చని చెబుతున్నప్పటికీ, రైల్వే, ఐటీ, పౌర విమానయాన వంటి శాఖల్లో కొత్త వారు వచ్చే అవకాశం ఉందని గాసిప్స్ వినిపిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్ 10 లోపునే విస్తరణ ప్రక్రియ ముగించాలని చూస్తున్నారట. ఎవరెవరికి బెర్తులు దక్కుతాయి? ఎవరికి ఉద్వాసన పలుకుతారు? అనే ఉత్కంఠ ఇప్పుడు ఎంపీల్లో నెలకొంది. ఈసారి విస్తరణలో సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఖచ్చితంగా ఉంటాయని, ఊహించని పేర్లు తెరపైకి వస్తాయని ఎక్కువ మంది నమ్ముతున్నారు.

## బీఆర్ఎస్ కోసమే బీజేపీ రైతు యాత్ర: ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**హైదరాబాద్, మే 26:** బీజేపీ నాయకులు చేపట్టిన రైతు యాత్రపై ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.
ఈరోజు(మంగళవారం) సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు చేసేది దద్దమ్మల యాత్ర అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకులు డ్రామా చేస్తున్నారని.. యాత్రలు చేసే వాళ్లు వస్తుంటారు, పోతుంటారని అన్నారు. బీఆర్ఎస్ చేసిన దుర్మార్గాల వల్లే ఈ సమస్యలు తలెత్తాయని విమర్శించారు. బీఆర్ఎస్ కోసమే వాళ్ల బీ-టీమ్ బీజేపీ రైతు యాత్ర చేస్తోందని వేముల వీరేశం ఆరోపించారు. 'మీ ప్రోగ్రెస్ కార్డులో మోదీ అటెండెన్స్ కోసమే బీజేపీ ఈ యాత్ర చేస్తోంది' అని ప్రభుత్వ విప్ వ్యాఖ్యానించారు. ధాన్యాన్ని ప్రధాని మోదీతో కొనిస్తామని బీజేపీ నేతలు చెప్పాలని.. ప్రతి గింజను కొనమని ప్రధానిని ఒప్పించాలని సవాల్ విసిరారు. దేశంలో చేతకాని ప్రభుత్వం ఉందని.. ఏమీ చేయలేని బీజేపీ నేతలు పనీపాట లేక యాత్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. రైతు వ్యతిరేక పార్టీ బీజేపీ అని అన్నారు. రైతులకు వచ్చిన ఇబ్బందులకు కారణం మేమే అని బీజేపీ నేతలు చెప్పాలన్నారు. రైతుల దగ్గరికి వెళ్లిన బీజేపీ నేతలు.. వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని.. రైతులు పండించిన చివరి గింజ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొంటుందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో కొత్తగా మరో జీసీసీ కేంద్రం




**హైదరాబాద్, మే 26:** నగరంలో కొత్తగా మరో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జీసీసీ) కేంద్రం ఏర్పాటు కానుంది. రీజెనరాన్.. తొలి విదేశీ జీసీసీకి తెలంగాణ ఎంపిక అయింది. మంగళవారం హైదరాబాద్‌లో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో రీజెనరాన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరి మధ్య ఒప్పందం ఖరారైంది. హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా రీజెనరాన్ అభివృద్ధి చేయనుంది. క్లినికల్ ట్రయల్స్, ఏఐ, డేటా సైన్స్ సేవలను జీసీసీ అందించనుంది. దీంతో తెలంగాణలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల సంఖ్య 450కి చేరనుంది.జీసీసీల కేంద్రంగా దేశంలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. దీని ద్వారా బయోటెక్, ఏఐ రంగాల్లో హైదరాబాద్‌కు ఆదరణ పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. జీనోమ్ వ్యాలీ విస్తరణతో లైఫ్ సైన్సెస్‌కు మరింత బలం చేకూరనుంది. గ్రీన్ ఫార్మా సిటీతో కొత్త పెట్టుబడులకు ఊతం ఇచ్చినట్లు అవుతోంది. రీజెనరాన్ జీసీసీ ఏర్పాటుతో భారీగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. రీజెనరాన్ పెట్టుబడితో తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచినట్లు అయింది.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం



**హైదరాబాద్, మే :** ఏపీ ప్రభుత్వం ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను హైదరాబాద్‌లోనే అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తోందని.. అదే జరిగితే ఏపీ సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను జనసేన పార్టీ, ఏపీ పోలీసులు, ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసుల పేరుతో వేధిస్తున్నాయని సోమవారం ఎక్స్'వేదికగా ఆమె మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా రాజకీయ విశ్లేషణలు చేసే నాగేశ్వర్‌పై కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ కుట్రలు చేస్తున్నారన్నారు. తెలంగాణ సమాజం, తెలుగు ప్రజలు గౌరవించే మేధావిపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదుచేసి వేధింపులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాగా, వడదెబ్బ మృతుడి కుటుంబానికి భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ వాహనం ఇవ్వకపోవటంతో... కిలోమీటర్‌కు పైగా మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన ఘటనపై కవిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఉదంతంతో రేవంత్‌రెడ్డిది అమానవీయ ప్రభుత్వమని, పేదలపట్ల ఎంత నిర్దయగా ఉందో అర్థమవుతోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## రాజాసింగ్‌కు సైబర్ కేటుగాడి ఫేక్ కాల్.. ప్రమాదం నుంచి తప్పించుకున్న రాజాసింగ్!

**ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ అని పరిచయం చేసుకున్న కేటుగాడు**
**డిప్యూటీ సీఎం పీఏకు ఫోన్ చేసి అలాంటి వ్యక్తి ఎవరూ లేరని నిర్ధారించుకున్న రాజాసింగ్**
**ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరిక**



సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు చాలామందిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకుని కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసానికి తెరలేపగా, అప్రమత్తమైన రాజాసింగ్ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఫేక్ కాల్ ఉదంతంపై ఆయన స్వయంగా ఒక వీడియోను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. రాజాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... నిన్న సాయంత్రం ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ కుమార్‌ని అంటూ పరిచయం చేసుకున్నాడు. "ప్రధాన మంత్రి వికసిత్ భారత్" పథకం కింద తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా నియోజకవర్గ యువతకు 50 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల రుణాలు ఇస్తామని నమ్మబలికాడు. అన్నింటిలో ముందుండే మీరు ఈ స్కీమ్‌కు ఎందుకు అప్లై చేయలేదని ప్రశ్నిస్తూ.. ఇవాళ రాత్రిలోపే ఆధార్ కార్డ్ వివరాలు పంపాలని ఒత్తిడి చేశాడు. ఈ గడువు విధింపుతో అనుమానం వచ్చిన రాజాసింగ్... వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీఏకు ఫోన్ చేసి క్రాస్ చెక్ చేసుకున్నారు. ఆర్థిక శాఖలో దిలీప్ కుమార్ అనే అధికారి ఎవరూ లేరని, అసలు అలాంటి స్కీమే లేదని తేలడంతో అది ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నారు. నియోజకవర్గ ప్రగతి కోసమని ఆశపడి ప్రజాప్రతినిధులు ఇలాంటి మోసాల బారిన పడే ప్రమాదం ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరించారు. ఈ సైబర్ నేరగాడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# నిధుల వేటలో హెచ్‌ఎండీఏ....

**హైదరాబాద్, మే 26:** హైదరాబాద్ మహానగరంలో చేపట్టబోయే ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధుల కొరత రాకుండా చూసేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతితో వివిధ విదేశీ బ్యాంకుల నుంచి రుణాలు సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా చైనా డెవలప్‌మెంట్ బ్యాంక్, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్, అలాగే ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ వంటి ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా హెచ్‌ఎండీఏ సీఈఓ రవీందర్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి బృందం చైనాలో పర్యటించనుంది. అక్కడ జరుగుతున్న మౌలిక ప్రాజెక్టులను పరిశీలించడంతో పాటు బ్యాంక్ అధికారులతో ఈ బృందం ప్రత్యేకంగా సమావేశం కానుంది.మహానగర పరిధిలో సుమారు రూ.30,000 కోట్ల వ్యయంతో పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వీటిలో కొన్నింటికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. ప్రధాన ప్రాజెక్టులలో




మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఉత్తర తెలంగాణ వైపు ఎలివేటెడ్ కారిడార్లు, ఔటర్ రింగ్ రోడ్డు రావిర్యాల నుండి ఆమన్ గల్ వరకు 'ఫ్యూచర్' సిటీని అనుసంధానిస్తూ నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బుద్వేల్ నుంచి మరో రేడియల్ రోడ్డు, ఈసీఐఎల్ నుంచి శీలా లేఅవుట్ వరకు ఎలివేటెడ్ కారిడార్-3 ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్టులన్నింటికీ సకాలంలో నిధులు సేకరించేందుకు గాను ఇప్పటికే సీటీబీ (, బ్యాంక్ ఆఫ్ చైనా వంటి సంస్థలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోందిసాధారణంగా దేశీయ బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలపై వడ్డీ రేట్లు 10 శాతానికి పైగానే ఉంటాయి. కానీ, ఏఐఐబీ వంటి అంతర్జాతీయ రుణ సంస్థల్లో కేవలం 4 శాతం వరకే వడ్డీ ఉండటంతో పాటు, రుణం తిరిగి చెల్లించడానికి ఎక్కువ కాలపరిమితి లభిస్తుంది. ఈ ప్రయోజనాల వల్లే హెచ్‌ఎండీఏ విదేశీ రుణాల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తోంది.గతంలో చైనా బ్యాంకుల నుంచి రుణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆ ఫైల్ ముందుకు సాగలేదు. అయితే ప్రస్తుతం వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, ఏఐఐబీ వంటి మల్టీ లాటరల్ బ్యాంకుల వైపు హెచ్‌ఎండీఏ మొగ్గు చూపుతోంది. ఏఐఐబీ బ్యాంక్ చైనాకు చెందినదే అయినప్పటికీ, అందులో దాదాపు 100 దేశాలకు సభ్యత్వం ఉన్నందున.. ఈసారి కేంద్ర ప్రభుత్వం నుండి సులువుగా అనుమతులు (పచ్చజెండా) లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# జీడిమెట్లలో రియల్ బూమ్....

**హైదరాబాద్, మే 26:**హైదరాబాద్ మహానగరంలో జీడిమెట్ల పేరు వింటే వెంటనే గుర్తొచ్చేది అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం. ప్రత్యక్షంగా వేలాది మందికి, పరోక్షంగా లక్షలాది మందికి జీవనాధారం. ఇక్కడ పరిశ్రమల్లో పని చేసేందుకు తెలుగు రాష్ట్రాలతో పోటీగా బిహార్, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల కార్మికులు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఓసారి ఈ కాలనీపై ఓ లుక్కేయండి... భారీ పరిశ్రమల మధ్యలో దాగున్న జీడిమెట్ల కాలనీలకు వెళితే ప్రశాంతమైన పల్లెటూరికి వచ్చామా అనేలా ఆహ్లాదకరమైన అనుభూతి కలుగుతుంది. ఇక్కడ కాలనీల చుట్టూ పరిశ్రమల పొగ, కలుషితమైన నీరు.. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు జీడిమెట్ల అంటే హైదరాబాద్ రియల్ రంగంలో మెరుపు వేగంతో దూసుకుపోతున్న కీలక ప్రాంతం. అందుకే గతంలో వద్దు బాబోయ్ మాకు జీడిమెట్ల జాగా అన్నవాళ్లు.. ఇప్పుడు కొనగలమా ఇక్కడ జాగా అంటూ నోరెళ్లబెడుతున్నారు.ఇక్కడ సొంతిల్లు 10 లక్షల నుండి ఇప్పుడు కోటిన్నరకు పైగా చేరుకుంది. ఇక్కడ అపార్ట్మెంట్ కల్చర్ ఊహించని స్థాయిలో పెరిగిపోయింది. సొంత ఇళ్లు కంటే ఫ్లాట్లు కట్టి అమ్మేస్తున్నారు. కాలుష్యం గతంతో పోల్చితే బాగా తగ్గింది. తాగునీటి సమస్యకు విముక్తి కలిగింది. మంజీరా వాటర్ ప్రతీ ఇంటికీ చేరుతోంది. అపార్ట్మెంట్ లో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనాలంటే జీడిమెట్ల కాలనీలలో ఇప్పుడు 50 లక్షల నుండి 60 లక్షల మధ్య ధర పలుకుతోంది.హైదరాబాద్ లో ప్రైమ్ ఏరియా కూకట్ పల్లికి కూతవేటు దూరంలో ఉన్న జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో, పరిశ్రమలు దాటుకుని లోపల కాలనీలలోకి వెళితే భాగ్యనగరంలో ఓ కొత్త ప్రపంచాన్ని చూసినట్లుటుంది. గత పదేళ్ల కాలంలో జీడిమెట్ల కాలనీలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా దశాబ్దాల నుండి వెంటాడుతున్న త్రాగునీరు, పారిశుధ్యం, కాలుష్యం వంటి సమస్యలకు పరిష్కారం లభించింది. ఈ ప్రభావంతో రియల్ ధరలు విపరీతంగా పెరిగాయి. గజం 20వేల నుండి ఏకంగా 75 వేలు, కొన్నిచోట్ల లక్షకు పైగా ధర పలుకుతోంది. అంటే ఓ 10 గజాలు జాగా కొనాలంటే ఇప్పుడు 75 లక్షలకు పైమాటే.తాజాగా ధరలు ఏ మాత్రం తగ్గలేదు కానీ హైదరాబాద్ వ్యాప్తంగా రియల్ రంగం మందకొడిగా ఉండటంతో కొనుగోళ్లు, అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. నిర్మాణ వ్యయం కూడా ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. ఇళ్లు కట్టాలంటే ఒకప్పటి లెక్కలు పూర్తిగా మారిపోయాయి. ధరలు అమాంతం పెరగడంతో ఆ ప్రభావం కొనుగోళ్లు , అమ్మకాలు ఉపాధి అవకాశాలపై స్పష్టంగా కనిపిస్తుంది. బయట నుండి చూస్తున్నవారికి జీడిమెట్ల అంటే విపరీతమైన వాయుకాలుష్యం, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం, అక్కడ ఉండలేమనే అభిప్రాయం ఉంటుంది. కానీ జీడిమెట్ల కాలనీలకు వస్తే ఇక్కడ పూర్తిగా రివర్స్ లో ఇక్కడ ప్రశాంతమైన వాతావారణం కనిపిస్తుంది. పచ్చటి చెట్ల మధ్యలో ఇళ్లు, వాహనాల రద్దీ, ధ్వని కాలుష్యం , ఇవేవీ కనిపించవు, వినిపించవు. అచ్చమైన పల్లెటూరి వాతావరణం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉపాధి కూలీలు, వారిని నమ్ముకుని నడుస్తున్న కిరాణ వ్యాపారాలు, చిన్న చిన్న హోటల్స్ ఇలా జీడిమెట్ల కాలనీలు హైదరాబాద్ మహానగరం మధ్యలో ఉన్న ఆహ్లాదకర



ప్రాంతాలుగా చెప్పవచ్చు. హైదరాబాద్ మహానగరంలో ఓ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి కనెక్టివిటీ ఖచ్చితంగా ఉంటుంది. కానీ ఈ విషయంలో జీడిమెట్ల కాలనీలలో వింత పరిస్థితి కనిపిస్తుంది. పారిశ్రామిక వాడమీదుగా జీడిమెట్ల కాలనీలలోకి ఎంటర్ అయ్యామంటే , అక్కడితో కాలనీ ఎండ్ వరకూ వెళ్లి, మళ్లీ వెళ్లిన దారిలోనే తిరిగి వెనక్కు రావాల్సిందే. మరో మార్గం ద్వారా వేరే ప్రాంతానికి వెళ్లడం జీడిమెట్ల కాలనీలలో అసాధ్యం. సింగిల్ ఎంట్రీ జీడిమెట్ల కాలనీలకు మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు.జీడిమెట్ల కాలనీలలో ఇటీవల కాలంలో ఇంటి అద్దెలు భారీగా పెరిగాయి. సింగిల్ బెడ్ రూమ్ ఇంటి అద్దె 10వేలకు చేరుకుంది. డబుల్ బెడ్ రూమ్ అయితే 15 నుండి 18వేల మధ్య నడుస్తోంది. అపార్ట్మెంట్ లో ఫ్లాట్ అయితే 50లక్షలకు పైమాటే. ఇలా భారీ పరిశ్రమల చాటున దాగిన జీడిమెట్ల హైదరాబాద్ రియల్ రంగంలో సైలెంట్ గా దూసుకుపోతోంది.

## మజ్లిస్ ఒత్తిడితో జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారు..

### రేవంత్ సర్కార్‌పై రామచందర్‌రావు ధ్వజం

**హైదరాబాద్, మే 26 :** ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. ఈరోజు (మంగళవారం) కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు.



**డివిజన్ల ఏర్పాటుపై అధికారులకు క్లారిటీ లేదు..**

మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

**రియల్ ఎస్టేట్ రంగం కుదేలు..**

కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## వాహన్ తిప్పలు.. దళారుల రాజ్యం..

**హైదరాబాద్, మే 26:**'రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా డిజిటల్ సేవలను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్రీకృత 'వాహన్' పోర్టల్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ సేవలు సకాలంలో అందకపోవడంతో సామాన్యులు విసిగిపోతున్నారు. ఇదే తరుణాన్ని ఆసరాగా చేసుకుని దళారులు (ఏజెంట్లు) వేలల్లో డబ్బులు తీసుకుంటూ సామాన్యులను దోచుకుంటున్నారు.లర్నింగ్ లైసెన్స్ (ూూ=), డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ (రెక్టిఫికేషన్/రిన్యూవల్), చిరునామా మార్పు, డూప్లికేట్ లైసెన్స్ వంటి విభిన్న రకాల సేవల కోసం దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. రాష్ట్ర రవాణా శాఖ ఇటీవల ఈ విధానంలోకి మారినప్పటికీ, అప్పటి నుంచి సాంకేతిక లోపాలు నిత్యకృత్యంగా మారాయి.గతంలో నిమిషాల్లో పూర్తయ్యే డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ, ఇప్పుడు అరగంట దాటినా కావడం లేదు. ఎల్‌ఎల్ఆర్ దరఖాస్తుకు మొబైల్ నంబర్ ఆథెంటికేషన్ కావడం లేదు. సరైన సైజులో ఫోటోలు, సంతకం, ఇతర ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసినప్పటికీ వెబ్‌సైట్‌లో లోపాలు తలెత్తుతున్నాయి.సొంతంగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తే వెబ్‌సైట్ పనిచేయకపోవడం, అదే రవాణా కార్యాలయాల్లోని ఏజెంట్లను ఆశ్రయిస్తే వెంటనే స్లాట్ బుకింగ్ అయిపోతుండటం గమనార్హం. వెబ్‌సైట్‌లో ప్రతి సేవకు ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ రుసుము ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం దళారులు చెప్పిందే వేదంగా మారుతోంది. ఆన్‌లైన్ ఫీజుతో సంబంధం లేకుండా ఒక్కో సేవకు ఒక్కో రకమైన ధర నిర్ణయించి వాహనదారుల నుంచి వేల రూపాయలను వసూలు చేస్తున్నారు."నా కుమారుడికి లైసెన్స్ కోసం సొంతంగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేయడానికి ఎంత ప్రయత్నించినా కాలేదు. కానీ స్థానిక ఆర్టీఓ ఆఫీసులో ఒక ఏజెంట్‌ను సంప్రదించగానే వెంటనే స్లాట్ బుక్ అయింది. ఇందుకోసం అతనికి రూ. 3 వేలు ఇవ్వాల్సి వచ్చింది. రవాణా శాఖ ఆఫీసుల చుట్టూ తిరగకుండా సొంతంగా చేసుకోవచ్చని చెబుతున్నా, ఆచరణలో మాత్రం దళారులను ఆశ్రయించనిదే పని కావడం లేదు అని"ఆసిఫ్ నగర్‌కు చెందిన ఒక వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు.పోర్టల్‌లో ఎలాంటి సమస్యలు లేవని రవాణా శాఖ అధికారులు పైకి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జాతీయ సంస్థ 'ఎన్ఐసీ' (NIC) నుంచి అవసరమైన టెక్నికల్ సపోర్ట్ తీసుకుంటున్నామని, 'వాహన్' పోర్టల్‌లో మరిన్ని కొత్త మాడ్యూళ్లను దశలవారీగా ప్రవేశపెడతామని అధికారులు పేర్కొంటున్నా

## ఎన్టీఆర్ విగ్రహ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల



**హైదరాబాద్:**అమీర్పేట్ మైత్రివనంలో యుగపురుషుడు, మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు నందమూరి తారక రామ రావు విగ్రహ ప్రతిష్ట పనులను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు,జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ పరిశీలించారు..గత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ప్రజల కోరిక మేరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఎన్టీఆర్ గారి 103వ జయంతి సందర్భంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహ నిర్మాణ పనులు మరియు సభ ఏర్పాట్లను నేడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు, ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ కలిసి పరిశీలించారు.. తరువాత మంత్రి తుమ్మల నాగేశ్వరావు రావు కి ఎన్టీఆర్ గారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే అందజేశారు.. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఎన్టీఆర్ అభిమానులు,తదితరులు పాల్గొన్నారు..

## గవర్నర్ ని కలిసిన కవిత..



**హైదరాబాద్:**లోక్ భవన్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కలిసారు. వెలుగుమట్ల, కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసారు. లవడం జరిగింది. వెలుగుమట్లలో ఇండ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని, ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్పు మరియు భూసేకరణ సమస్యలపై బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశారు.



# వేసవిలో రోజూ పెరుగన్నం తినండి.. ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు..

వేసవికాలంలో శరీరానికి చల్లదనం ఇచ్చే ఆహారాలను తీసుకోవడానికి ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. అలాంటి ఆహారాల్లో పెరుగన్నం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తేలికగా జీర్ణమయ్యే ఈ సంప్రదాయ వంటకం వేడికాలంలో శరీరానికి ఉపశమనం కలిగించడమే కాకుండా పొట్టకు కూడా హాయిని ఇస్తుంది. అయితే రెండు వారాల పాటు ప్రతిరోజూ పెరుగన్నం తింటే శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందిలో ఉంటుంది. నిపుణుల ప్రకారం, ఇది జీర్ణక్రియ నుంచి హైడ్రేషన్ వరకు పలు ప్రయోజనాలను అందిస్తుందని చెబుతున్నారు. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ ఆరోగ్యకరమైన గట్ (జీర్ణ వ్యవస్థ) బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడతాయి. అందువల్ల పెరుగన్నం తరచూ తింటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు కడుపు ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. అన్నం మృదువుగా ఉండటం వల్ల వేసవిలో సులభంగా జీర్ణమవుతుంది. ఫెర్మెంటెడ్ ఫుడ్స్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం గట్ ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

**వేసవి సమస్యలను తగ్గిస్తుంది..**

పెరుగన్నం సహజసిద్ధంగా శరీరానికి చల్లదనం అందించే ఆహారం. పెరుగులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతోపాటు పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ కూడా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటంలో సహాయపడతాయి. వేసవిలో డీహైడ్రేషన్, అలసట సమస్యలను తగ్గించడంలో పెరుగన్నం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. దోసకాయ, కరివేపాకు వంటి పదార్థాలు కలిపితే మరింత చల్లదనం లభిస్తుంది. అంతేకాకుండా అధిక మసాలా లేదా నూనెతో చేసిన వంటకాలతో పోలిస్తే పెరుగన్నం తేలికగా ఉంటుంది. అన్నంలో కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. పెరుగులో ఉండే కొద్దిపాటి ప్రోటీన్, కొవ్వు కలిసి ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తాయి. దీనివల్ల మధ్యాహ్న సమయంలో అలసట తగ్గి శక్తి స్థాయిలు స్థిరంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**రోగ నిరోధక శక్తికి..**

పెరుగులోని ప్రోబయోటిక్స్ రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేయడంలో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. గట్ ఆరోగ్యం మెరుగుపడితే శరీర రక్షణ వ్యవస్థ కూడా మెరుగ్గా పనిచేస్తుందని చెబుతున్నారు. రెండు వారాల వ్యవధిలోనే కొంతమేర జీర్ణ సమస్యలు తగ్గినట్లు చాలామంది గమనించే అవకాశం ఉందని వివరిస్తున్నారు. అయితే ప్రతిరోజూ పెరుగన్నమే తినడం వల్ల పోషకాల వైవిధ్యం తగ్గే ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెరుగన్నంలో ఐరన్, ఫైబర్ వంటి కొన్ని పోషకాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి కూరగాయలు, పప్పులు, పండ్లు వంటి ఇతర ఆహారాలను కూడా సమతులంగా తీసుకోవడం అవసరం. క్యారెట్ తురుము, దానిమ్మ గింజలు, వేయించిన గింజలు కలిపి తింటే ఈ వంటకం మరింత పోషకవంతంగా మారుతుంది.

**బరువు తగ్గేందుకు..**

ఇక పెరుగన్నాన్ని సరైన మోతాదులో తీసుకుంటే బరువు నియంత్రణకు కూడా ఉపయోగపడుతుంది. ఇది ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచి మధ్యలో అనవసరమైన స్నాక్స్ తినే అలవాటును తగ్గిస్తుంది. అయితే అన్నం ఎక్కువగా తీసుకుంటే క్యాలరీలు పెరిగే అవకాశం ఉండటంతో పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో రెండు వారాల పాటు పెరుగన్నం తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం, జీర్ణక్రియలో మెరుగుదల, తేలికైన అనుభూతి వంటి ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంటుంది. అయితే సమతుల ఆహారంతోపాటు ఇతర పోషకాలు కూడా అందేలా జాగ్రత్తపడితేనే పూర్తి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరిచే అద్భుతమైన పదార్థం ఇది.. కానీ జాగ్రత్తగా తీసుకోవాల్సిందే..



వేసవి కాలం కావడంతో శరీరానికి చల్లదనం ఇచ్చే ఆహారాలు, పానీయాల వినియోగం పెరుగుతోంది. శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే సంప్రదాయ పదార్థాల్లో గోండ్ కతీరా కూడా ఒకటి. సహజసిద్ధమైన ఈ గమ్‌ను చాలామంది శర్బత్‌లు, మిఠాయిలు, కూలింగ్ డ్రింక్స్‌లో ఉపయోగిస్తుంటారు. శరీరాన్ని చల్లగా ఉంచడంలో, హైడ్రేషన్ మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. అయితే గోండ్ కతీరాను సరైన సమయంలో, సరైన మోతాదులో తీసుకోవడం చాలా ముఖ్యమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పోషకాహార నిపుణుల ప్రకారం, గోండ్ కతీరాను ఉదయం ఖాళీ కడుపుతో లేదా మధ్యాహ్నానికి ముందు సమయంలో తీసుకోవడం ఉత్తమం. ముఖ్యంగా వేసవిలో దీనిని రోజులో తొందరగా తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం ఎక్కువగా అందుతుందని చెబుతున్నారు. రాత్రి సమయంలో లేదా అధిక మోతాదులో తీసుకుంటే జీర్ణక్రియ మందగించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఇది భారంగా అనిపిస్తుందని పేర్కొంటున్నారు.

**సరైన విధంగా నానబెట్టాలి..**

గోండ్ కతీరా నీటిలో నానిన తర్వాత జెల్‌లా మారుతుంది. ఇదే దాని చల్లదనానికి ప్రధాన కారణం. అయితే ఈ జెల్ ఆకృతి కొందరిలో జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీన్ని సరైన విధంగా తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. గోండ్ కతీరాను తీసుకునే ముందు ఒకటి నుంచి రెండు టీ స్పూన్ల మోతాదులో రాత్రంతా నీటిలో నానబెట్టాలని సూచిస్తున్నారు. తరువాత తయారైన జెల్‌లో ఒకటి నుంచి రెండు టేబుల్ స్పూన్ల వరకు తీసుకోవచ్చు. దీన్ని తగినంత ద్రవాలతో కలిపి తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అయితే పొడిగా నేరుగా తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే గోండ్ కతీరా అందరికీ ఒకేలా అనుకూలించదని కూడా నిపుణులు చెబుతున్నారు. కడుపు ఉబ్బరం, ఐబీఎస్, తరచుగా గ్యాస్ సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే తక్కువ బీపీ ఉన్నవారు, ఇప్పటికే అధిక ఫైబర్ ఆహారం తీసుకునేవారు, జీర్ణక్రియ నెమ్మదిగా ఉండేవారు కూడా మోతాదుపై శ్రద్ధ పెట్టాలని చెబుతున్నారు. రోజంతా తక్కువ నీరు తాగే అలవాటు ఉన్నవారికి కూడా ఇది అసౌకర్యం కలిగించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

**భారీ భోజనం తరువాత వద్దు..**

అనారోగ్యం నుంచి కోలుకుంటున్నవారు లేదా ఆకలి తక్కువగా ఉన్నవారు కూడా దీన్ని జాగ్రత్తగా తీసుకోవాలని సూచిస్తున్నారు. కొంతమంది మహిళలకు పీరియడ్స్ సమయంలో గోండ్ కతీరా తీసుకుంటే అధిక చల్లదనం కారణంగా అసౌకర్యంగా అనిపించే అవకాశం ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. వ్యాయామానికి ముందు, భారీ భోజనం చేసిన వెంటనే లేదా మందులతో పాటు గోండ్ కతీరా తీసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మందులు తీసుకునే సమయానికి గోండ్ కతీరా మధ్య కనీసం రెండు నుంచి మూడు గంటల గ్యాప్ ఉండాలని సూచిస్తున్నారు. సరైన మోతాదులో, సరైన సమయంలో తీసుకుంటే గోండ్ కతీరా వేసవిలో శరీరానికి చల్లదనం అందించే మంచి సహజ పదార్థంగా ఉపయోగపడుతుంది. అయితే వ్యక్తిగత జీర్ణక్రియ, నీటి వినియోగం, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎండలు పెరుగుతున్న వేళ.. ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచనలు..



దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుతున్న నేపథ్యంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖతోపాటు ఆరోగ్య సేవల విభాగం ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. తీవ్రమైన ఎండల ప్రభావం వల్ల డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాస్షన్, కండరాల పట్టేయడం, మూర్ఛ, తీవ్రమైన పరిస్థితుల్లో హీట్‌స్ట్రోక్ వంటి ప్రాణాపాయ సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించింది. ముఖ్యంగా తలనిర్భంధం, వాంతులు, తలనొప్పి, గందరగోళం, వేగంగా గుండె కొట్టుకోవడం, గాఢ పసుపు రంగు మూత్రం, అపస్మారక స్థితి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించింది. వేసవిలో దాహం వేయకపోయినా తరచూ నీరు తాగడం చాలా ముఖ్యమని సూచించింది. దాహం లేకపోవడం అంటే శరీరానికి నీరు అవసరం లేదని కాదని స్పష్టం చేసింది. శరీరాన్ని చల్లగా ఉంచేందుకు ఇంట్లో తయారు చేసే సంప్రదాయ పానీయాలను తీసుకోవాలని సూచించింది.

**లస్సీ, కొబ్బరి నీళ్లు..**

చాస్, లస్సీ వంటి పానీయాలు వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపింది. ఇవి శరీరానికి తేమను అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడతాయని పేర్కొంది. కొబ్బరి నీరు సహజ ఎలక్ట్రోలైట్స్‌తో నిండిన ఉత్తమ పానీయంగా పేర్కొంది. ఇది శరీరంలో కోల్పోయిన ఖనిజాలను తిరిగి భర్తీ చేయడంలో సహాయపడుతుందని తెలిపింది. నిమ్మరసం వేసవిలో అత్యంత సులభమైన, ప్రభావవంతమైన పానీయమని సూచించింది. కొద్దిగా ఉప్పు కలిపి తీసుకుంటే శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతుందని పేర్కొంది. సత్తు పానీయం కూడా వేసవిలో శక్తిని ఇచ్చే చల్లని పానీయంగా సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉపయోగించే ఈ పానీయం శరీర వేడిని తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపింది. అలాగే ఆమ్ పన్నా శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చెమట ద్వారా కోల్పోయిన లవణాలను భర్తీ చేస్తుందని పేర్కొంది. హీట్ ఎగ్జాస్షన్ నివారణలో ఇది ఉపయోగకరమని తెలిపింది. బేల్ శర్బత్‌ను సహజ శీతల పానీయంగా వివరించింది. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడంలో సహాయపడుతుందని పేర్కొంది.

**మజ్జిగ, పుచ్చకాయ..**

ఇక దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన నన్నారి పానకం కూడా వేసవిలో ఉపయోగకరమైన పానీయమని తెలిపింది. నన్నారి సిరప్, నిమ్మరసం, సబ్జా గింజలు కలిపి తయారుచేసే ఈ పానీయం శరీరాన్ని తాజాగా ఉంచుతుందని పేర్కొంది. మజ్జిగలో ఉసిరికాయ, కరివేపాకు, అల్లం, సేంద్రీయ ఉప్పు కలిపి తయారు చేసే గూస్‌బెర్రీ బటర్‌మిల్క్ కూడా శరీరానికి చల్లదనాన్ని అందిస్తుందని సూచించింది. వేసవిలో ఎక్కువ నీటి శాతం ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించింది. పుచ్చకాయ శరీరాన్ని వెంటనే చల్లబరచడంలో సహాయపడుతుందని తెలిపింది. తర్బూజా కూడా శరీరానికి తేమను అందించే ఉత్తమ పండుగా పేర్కొంది. దోసకాయను సలాడ్, రైతా లేదా నేరుగా ఉప్పుతో తీసుకోవచ్చని, ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపింది.

**ద్రాక్ష, కూరగాయలు..**

ద్రాక్షలో సహజ చక్కెరలు, నీటి శాతం అధికంగా ఉండటంతో శక్తిని నిలబెట్టడంలో ఉపయోగపడుతుందని పేర్కొంది. కొబ్బరి బొండంలోని మృదువైన తురుము కూడా శరీరానికి చల్లదనాన్ని అందించే పోషకాహారంగా సూచించింది. బూడిద గుమ్మడికాయను ఆయుర్వేదం, సిద్ధ వైద్యంలో చల్లదనాన్ని ఇచ్చే ఆహారంగా భావిస్తారని తెలిపింది. దీన్ని వంటల్లో లేదా పానీయాల రూపంలో తీసుకోవచ్చని సూచించింది. టమాటాలు, లెట్యూస్ వంటి నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలను తేలికపాటి ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించింది. అలాగే తీవ్రమైన ఎండల సమయంలో మద్యం, అధిక టీ, కాఫీ, కార్బొనేటెడ్ శీతల పానీయాలు, అధిక చక్కెర కలిగిన డ్రింక్స్, ఎక్కువ నూనెతో చేసిన వంటకాలు, అధిక ప్రోటీన్ ఆహారాలను తగ్గించాలని హెచ్చరించింది. ఇవి శరీరంలో వేడిని పెంచి డీహైడ్రేషన్ సమస్యను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని తెలిపింది. సాంప్రదాయ భారతీయ వేసవి ఆహారాలు, పానీయాలు ప్రస్తుత కాలంలో మరింత అవసరమని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి.

## బిజినెస్

### ప్రెగాబాలిన్ దుర్వినియోగంపై ఆందోళన.. అమ్మకాలపై ఆరోగ్యశాఖ కఠిన ఆంక్షలు




**న్యూఢిల్లీ:** నరాల సంబంధిత వ్యాధులు, నొప్పులతో బాధపడేవారు.. పెగ్రాబాలిన్ మందును ఎక్కువగా వాడుతుంటారు. అయితే ఆ డ్రగ్‌ను దుర్వినియోగం చేస్తున్నట్లు ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. పాపులర్ పెయిన్‌కిల్లర్ ప్రెగాబాలిన్‌ను షెడ్యూల్ హెచ్1 కేటగిరీలో చేర్చింది. ఈ హెడ్యూల్‌లో ఉన్న మందులు కొనాలంటే, కచ్చితంగా ప్రిస్క్రిప్షన్ కావాల్సిందే. ఫార్మసిస్టులు ఆ డ్రగ్‌కు చెందిన డాక్టరు చిట్టిని ఒకటి దగ్గర పెట్టుకోవాలని, ఆ తర్వాత ఆ డ్రగ్ వాడకం గురించి మూడేళ్ల వరకు పేషెంట్ వివరాలను సేకరించాలని కేంద్రం తన నోటిఫికేషన్‌లో తెలిపింది. ప్రెగాబాలిన్ ట్యాబ్లెట్ వినియోగంపై పలు రాష్ట్రాలు ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఆ డ్రగ్‌ను యువత దుర్వినియోగం చేస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రెగాబాలిన్ అమ్మకాలపై కఠిన ఆంక్షలు పెట్టడం అంటే బాధ్యతను పెంచడమే అని ప్రభుత్వం తెలిపింది. అక్రమ మార్గంలో ఆ మందును వినియోగించడాన్ని నియంత్రిస్తున్నట్లు చెప్పింది. డ్రగ్ దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను అడ్డుకునేందుకు కఠిన ఆంక్షలు పెట్టాల్సి వస్తుందని ఆరోగ్య శాఖ పేర్కొన్నది. దీర్ఘకాలిక నొప్పులు, న్యూరోపథి, ఫిబ్రోమల్జియాతో పాటు నరాల సంబంధిత వ్యాధుల చికిత్స కోసం ప్రెగాబాలిన్ మందును డాక్టర్లు సూచిస్తారు. అయితే ఆ డ్రగ్ మార్కెట్లో చాలా పాపులర్. కానీ కొందరు దీన్ని తప్పుగా వాడుతున్నారు. దేశవ్యాప్తంగా అక్రమ రీతిలో ప్రెగాబాలిన్ అమ్మకాలు జరుగుతున్నట్లు గుర్తించామని ఆరోగ్య శాఖ తెలిపింది. ఉత్పత్తిదారులు ఆ డ్రగ్‌పై షెడ్యూల్ హెచ్1 వార్నింగ్ అని రాయాలని పేర్కొన్నది. ప్రస్తుతం షెడ్యూల్ హెచ్‌లో ప్రెగాబాలిన్ డ్రగ్ ఉన్నది. ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఆ మందును ఫార్మసిస్టులు అమ్మాలని హెచ్ కేటగిరీ వెల్లడిస్తుంది. హెచ్1 కేటగిరీల స్ట్రాంగ్ యాంటీబయోటిక్స్, యాంటీ టీబీ డ్రగ్స్, హాబిట ఫార్మింగ్ మెడిసిన్స్ ఉంటాయి. యువత ఎక్కువగా ప్రెగాబాలిన్ మందును దుర్వినియోగం చేస్తున్నట్లు 2022లో పశ్చిమ పంజాబ్‌లో చేపట్టిన అధ్యయనం ద్వారా వెల్లడించారు.

### హోండా తొలి ఎలక్ట్రిక్ కారు: లాంచ్ ఎప్పుడంటే?



జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం హోండా కార్స్ ఇండియా భారత మార్కెట్‌లో విస్తరణకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. పాపులర్ సెడాన్ మోడల్ సిటీలో 'న్యూ సిటీ హైబ్రిడ్'ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.11.99 లక్షలు. ఇదే సమయంలో కంపెనీ.. ప్రీమియం ఎస్‌యూవీ 'జెడ్‌ఆర్--వీ'ను భారత మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ సందర్భంగా హెచ్‌సీఐఎల్ ప్రెసిడెంట్, సీఈవో టకాషీ నకజిమా మాట్లాడుతూ, ఈ రెండు మోడళ్లతో కలిపి 2026--27 లో మొత్తం ఆరు వ్యూహాత్మక మోడళ్లను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కొత్త లాంచ్‌లు భారత మార్కెట్లో హోండా బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు, కంపెనీ అమ్మకాలలో రెండంకెల వృద్ధి సాధించడంలో దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు. భారత్‌లో తొలి పూర్తి ఎలక్ట్రిక్ వాహనాన్ని 2026--27 ద్వితీయార్థంలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. 2030 నాటికి ఈవీలు, కాంపాక్ట్ ఎస్‌యూవీలు సహా పదికి పైగా కొత్త మోడళ్లను భారత్‌లో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

# బిట్‌కాయిన్ షాక్!

## ₹75,000 కిందకు పడిపోయిన క్రిప్టో కింగ్




క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో అత్యంత కీలకమైన మైలురాయిగా భావించే ₹75,000 సైకలాజికల్ సపోర్ట్ స్థాయిని బిట్‌కాయిన్ ఇవాళ బ్రేక్ చేసింది. అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్ మానిటరింగ్ సంస్థ బిట్‌కాయిన్ ట్రేడింగ్ వ్యూ (౨తీఘ౨ఆఅస్త్రఎఆవష) లైవ్ చార్ట్ ఆధారాల ప్రకారం.. బిట్‌కాయిన్ ప్రస్తుతం ₹74,678 వద్ద ట్రేడవుతోంది. ఇటీవలి కాలంలో సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి ఇది ఒక గమనించదగ్గ పతనంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**స్థిరత్వం నుంచి ఒక్కసారిగా క్రాష్!**

గత రెండు రోజులుగా బిట్‌కాయిన్ ₹77,000 నుంచి ₹78,000 రేంజ్‌లో గట్టి పట్టు సాధించడానికి ప్రయత్నించింది. మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు గట్టిగానే కనిపించింది. అయితే, ఇవాళ (మే 23) భారీ పతనం చవిచూసింది. ఈ మధ్యాహ్నం తర్వాత మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. ₹76,500 స్థాయిల వద్ద ఉన్న సపోర్ట్‌ను బ్రేక్ చేస్తూ ధర నేరుగా ₹74,250 వరకు పడిపోయింది. ప్రస్తుతం అక్కడ నుంచి స్వల్పంగా కోలుకుని ₹74,678 వద్ద కొనసాగుతోంది.

**పతనానికి తక్షణ కారణాలు**

గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య బిట్‌కాయిన్ ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ తాజా పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. పెద్ద పెద్ద సంస్థలు, ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవడం. ఇటీవలి కాలంలో బిట్‌కాయిన్ దిగువ స్థాయిల నుంచి భారీగా పుంజుకోవడంతో, ట్రేడర్లు ఈ స్థాయిలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటి కారణాలను చెప్పుకొస్తున్నారు.

**ఆల్ట్‌కాయిన్స్‌పై తీవ్ర ప్రభావం**

సాధారణంగా బిట్‌కాయిన్ పతనమైతే దాని ప్రభావం మొత్తం క్రిప్టో మార్కెట్‌పై పడుతుంది. లైవ్ వాచ్‌లిస్ట్ డేటా ప్రకారం.. బిట్‌కాయిన్ పతనం కారణంగా ఇథీరియం (జుఎ) మైనస్ రేంజ్‌లోకి వెళ్లగా, మిగిలిన ప్రధాన ఆల్ట్‌కాయిన్స్ కూడా తీవ్ర విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల గ్లోబల్ క్రిప్టో మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా కొంత మేర కుంచించుకుపోయింది. ప్రస్తుత మార్కెట్ సెంటిమెంట్ కాస్త ప్రతికూలంగా ఉన్నప్పటికీ, సుదీర్ఘ కాలంలో 'డిజిటల్ అసెట్'గా బిట్‌కాయిన్‌కు ఉన్న క్రేజ్ అలాగే ఉంటుందని దీర్ఘకాలిక హోల్డర్లు భావిస్తున్నారు. అయితే, స్వల్పకాలిక ట్రేడర్లు (రాష్ట్రశీతీ-వతీఎ తీఘసవతీం) మార్కెట్ స్థిరీకరణ కోసం వేచి చూడాలని, ఇటువంటి సమయంలో ఎలాంటి భావోద్వేగ లేదా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, రిస్క్ మేనేజ్‌మెంట్‌ను (ర్‌శీజూ ాశీం) కఠినంగా పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఆర్‌బీఐ నుంచి రికార్డు స్థాయిలో డివిడెండ్ బదిలీ!




దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో రూ.2.87 లక్షల కోట్ల మిగులు నిధులను (డివిడెండ్) బదిలీ చేసేందుకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం ఆమోదం తెలిపింది. ఈ భారీ బదిలీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు అండగా నిలవనుంది. గత ఏడాది బదిలీ చేసిన రూ.2.68 లక్షల కోట్ల కంటే ఇది ఎక్కువైనప్పటికీ మార్కెట్ నిపుణుల అంచనాల కంటే స్వల్పంగా తక్కువ కావడం గమనార్హం. అదే సమయంలో, పెరిగిపోతున్న ప్రపంచ ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా తన కంటింజెంట్ రిస్క్ బఫర్ (భవిష్యత్తులో వచ్చే ఊహించని ఆర్థిక నష్టాలు, మార్కెట్ ఒడిదుడుకులు లేదా ప్రపంచ ఆర్థిక సంక్షోభాలను తట్టుకోవడానికి ఆర్‌బీఐ పక్కన పెట్టే అత్యవసర నిధి) కూడా ఆర్‌బీఐ గణనీయంగా పెంచింది.

**ఆర్థిక ఒత్తిళ్ల నడుమ వెసులుబాటు**

ప్రస్తుతం అంతర్జాతీయంగా ముడి చమురు ధరల అస్థిరత, సబ్సిడీల భారం, మందగిస్తున్న ఆర్థిక వృద్ధి రేటు వంటి సవాళ్లను కేంద్రం ఎదుర్కొంటోంది. ఇలాంటి తరుణంలో ఆర్‌బీఐ నుంచి అందిన ఈ రికార్డు డివిడెండ్ ప్రభుత్వ ఖజానాకు గట్టి ఉపశమనాన్ని ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు (ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా యుద్ధం) కమ్ముకుంటున్న వేళ ద్రవ్యలోటును అదుపులో ఉంచడానికి ఈ నిధులు ఎంతవరకు సరిపోతాయనే అంశంపై ఆర్థికవేత్తల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# వన్డేలు, టీ20ల్లోనూ 'గులాబీ బంతి'..

# డ్రింక్స్ బ్రేక్‌లో హెడ్‌కోచ్‌కు అనుమతి..!






మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో సమూల మార్పులకు ఐసీసీ శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే వరల్డ్‌కప్ వంటి మెగా టోర్నీల్లో మహిళా క్రికెటర్లకు పురుషుల తో సమానంగా నగదు బహుమతిని అమలు చేస్తున్న ఐసీసీ ఈసారి బంతిపై దృష్టి సారించనుంది. ప్రస్తుతం టెస్టులకే పరిమితమైన పింక్ బాల్‌ను ఇక నుంచి వన్డే, టీ20ల్లోనూ ప్రవేశపెట్టేందుకు అత్యున్నత క్రికెట్ మండలి పావులు కదుపుతోంది. అన్నీ కుదరితే అహ్మదాబాద్‌లో జరగనున్న ఐసీసీ సమావేశంలో నిర్ణయం వెలువడే అవకాశముంది. పొట్టి క్రికెట్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్న ఈ రోజుల్లో టెస్టులు, వన్డేలను మరింత ఆసక్తిగా మార్చేందుకు ఐసీసీ ప్రయత్నిస్తోంది. ఇదివరకే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌కు జీవం పోసిన ఐసీసీ ఈసారిడ్రింక్స్ బ్రేకులోనూ హెడ్‌కోచ్‌ను అనుమతించాలనే ఉద్దేశంతో ఉంది. అలానే వన్డే, టీ20ల్లోనూ గులాబీ బంతికి ఓకే చెప్పడం, పొట్టి క్రికెట్‌లో ఇన్నింగ్స్ విరామం సమయాన్ని కుదించడం, ఆన్‌ఫీల్డ్ అంపైర్లకు హ్యాక్ ఐ డేటాను పరిశీలించే అవకాశమి వ్వడం వంటి వాటిపై ఐసీసీ దృష్టి సారిస్తోంది. బౌలర్లు బా అహ్మదాబాద్ వేదికగా మే 30న జై షా నేతృత్వంలోని ఐసీసీ ప్రతినిధుల సమావేశంలో వీటిపై తీర్మానాలు చేసి.. ఆమోద ముద్ర వేసే అవకాశముంది.

**పరిస్థితులను బట్టి**

టెస్టు క్రికెట్ ఆరంభం నుంచి ఎర్ర బంతినే ఉపయోగించేవారు. కానీ, ఈమధ్య గులాబీ బంతి టెస్టు మ్యాచులు చూశాం. ఐదు లేదా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా డే నైట్‌లో పింక్ బాల్ టెస్టు ఆడిస్తున్నారు. వన్డేలు, టీ20ల్లో ఎప్పటి నుంచో తెల్ల బంతినే వాడుతున్నారు. ఇకపై పరిస్థితులను బట్టి వన్డే, టీ20ల్లోనూ పింక్ బాల్ మ్యాచ్‌లకు ఐసీసీ అనుమతించనుంది. ఇరుజట్లు అంగీకరిస్తే డే నైట్ మ్యాచుల్లో గులాబీ బంతిని వాడేందుకు అనుకూలంగా నిబంధనలను మార్చనుంది.

**ఇన్నింగ్స్ బ్రేక్ కుదింపు..**

టీ20ల్లో ఇన్నింగ్స్ బ్రేక్‌ను కుదించడంపై ఐసీసీ సభ్యులు ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం తొలుత ఆడిన జట్టు ఇన్నింగ్స్ ముగిశాక 20 నిమిషాలకు రెండో జట్టు ఇన్నింగ్స్ మొదలవుతుంది. ఈ సమయాన్ని 15 నిమిషాలకు మార్చాలని ఐసీసీ బృందం భావిస్తోంది. ఇన్నింగ్స్ ముగిశాక ఆటగాళ్లు కలిసి.. చర్చించుకునేందుకు ఐదు నిమిషాలు పడుతుంది. మరో పది నిమిషాల తర్వాత వారు మైదానంలోకి దిగేలా నిబంధనలు మార్చాలని ఐసీసీ ప్రతినిధులు అనుకుంటున్నారు.

**డ్రింక్స్ బ్రేక్‌లో..**

ప్రస్తుతం టీ20ల్లో మాత్రమే డ్రింక్స్ బ్రేకులో హెడ్‌కోచ్‌లను మైదానంలోకి అనుమతిస్తున్నారు. వన్డేలు, టెస్టుల్లో మాత్రం స్క్వాడ్‌లోని ఆటగాళ్లకు మాత్రమే డ్రింక్స్‌ను గ్రౌండ్‌లోకి తీసుకువస్తుంటారు. కానీ, ఇకపై ఈ రెండు ఫార్మాట్లలోనూ ఇన్నింగ్స్ మధ్యలో కోచ్‌లను మైదానంలోకి అనుమతివ్వాలని ఐసీసీ భావిస్తోంది. అయితే.. డ్రింక్స్ తెచ్చే ఆటగాళ్లు క్రికెట్ జెర్సీ వేసుకోవాలి. ఇప్పుడు కోచ్‌లకు కూడా అదే నియమం వరిస్తుందా? అనేది తెలియాల్సి ఉంది. అలానే.. ఆన్‌ఫీల్డ్ అంపైర్లకు హ్యాక్ ఐ డేటాను పరిశీలించే అవకాశమివ్వాలని ఐసీసీ అనకుంటోంది. తద్వారా మైదానంలో బౌలర్లు ఎలాంటి అనైతికమైన పనులకు పాల్పడకుండా చూడాలని భావిస్తోంది.

## స్పోర్ట్స్

### కోహ్లీకి ఎదురుపడితే ఈసారి దబిడిదిబిడే!



ఐపీఎల్ 2026 సీజన్‌లో శుక్రవారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే మ్యాచ్ విజయం కన్నా విరాట్ కోహ్లీ, ట్రావిస్ హెడ్ మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆర్సీబీ ఇన్నింగ్స్ సమయంలోనే ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాచ్ ముగిసిన తర్వాత హెడ్‌కు షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి కోహ్లీ నిరాకరించడంతో వివాదం మరో మలుపుకు తిరిగింది. వివాదం జరిగి ఒకరోజు కావొస్తున్నా ఇంకా ఆ వేడి తగ్గలేదనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఒక ఆసక్తికర పరిణామం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. అదేంటంటే.. ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్‌లు క్వాలిఫయర్‌లో ఎదురుపడే అవకాశం లేదు. కానీ క్వాలిఫయర్-1 పోరులో ఆర్సీబీ ఓడి, ఎలిమినేటర్ పోరులో ఎస్ఆర్‌హెచ్ గెలిస్తే మాత్రం.. క్వాలిఫయర్-2 పోరులో ఈ రెండు జట్లు మళ్లీ తలపడనున్నాయి. అలా కాకుండా క్వాలిఫయర్-1లో ఆర్సీబీ గెలిచి.. మరోవైపు ఎలిమినేటర్‌తో పాటు క్వాలిఫయర్-2లోనూ ఎస్ఆర్‌హెచ్ గెలిచి ఫైనల్ చేరితే మాత్రం, తుది పోరులో ఆర్సీబీతో అమీతుమీ తేల్చుకోనుంది. ఏది ఏమైనప్పటికీ కోహ్లీ మాత్రం ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నాడు. మరోమారు ఎస్ఆర్‌హెచ్‌తో ఆర్సీబీ మ్యాచ్ ఆడితే మాత్రం హెడ్‌కు దబిడిదిబిడి అయ్యేలాగే పరిస్థితులు ఉన్నట్లు అభిమానులు పేర్కొంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

**అసలేం జరిగిందంటే..**

ఆర్సీబీ ఇన్నింగ్స్ సమయంలో కోహ్లీ స్లోగా ఆడడంతో హెడ్ ఏకాస్త బౌండరీలు కొట్టులి అంటూ కాస్త వెటకారంగా పేర్కొన్నాడు. దీంతో కోహ్లీకి చిర్రెత్తుకొచ్చి 'నువ్వు బౌలింగ్ చెయ్యి.. బౌండరీలు కొడుతా. అయినా నువ్వు ఎప్పుడు ఇంపాక్ట్ ప్లేయర్‌గానే వస్తున్నావు. ఒక్కసారి బౌలింగ్ కూడా రాలేదు' అని పేర్కొన్నాడు. కానీ హెడ్ మాత్రం కోహ్లీ వ్యాఖ్యలను పట్టించుకోకుండా సరదాగా నవ్వేశాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత హెడ్‌కు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి నిరాకరించడంతో కోహ్లీ దీనిని సీరియస్‌గా తీసుకున్నాడని స్పష్టంగా తెలిసొచ్చింది.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI** :TEL TEL / 2023/ 84132